RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 7 ISSUE NO : 7 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, జూన్, 24, 2025 Tuesday, June,24,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

## ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటన..
# కొట్టిపారేసిన ఇరాన్!



**వాషింగ్టన్, జూన్ 23:** ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆకస్మిక ప్రకటన తీవ్ర గందరగోళానికి దారితీసింది. అయితే, ఈ వార్తలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా నుంచి తమకు ఎలాంటి అధికారిక ప్రతిపాదన అందలేదని, ఇజ్రాయెల్ లేదా వాషింగ్టన్‌తో శత్రుత్వాన్ని ఆపే ప్రసక్తే లేదని ఒక సీనియర్ ఇరాన్ అధికారి సీఎన్ఎన్‌కు తెలిపారు. దీంతో ఈ కాల్పుల విరమణ అమలుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సోమవారం సాయంత్రం తన ట్రూత్ సోషల్ వేదికగా డొనాల్డ్ ట్రంప్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య 12 రోజుల యుద్ధం ముగిసిందని, ఇరు దేశాలు పూర్తిస్థాయి కాల్పుల విరమణకు అధికారికంగా అంగీకరించాయని ఆయన పేర్కొన్నారు. ఆరు గంటల్లో ఈ కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని, ఇది ప్రారంభమవుతుందని ట్రంప్ తెలిపారు. 12 గంటల పాటు ఈ విరమణ కొనసాగుతుం దని, ప్రత్యర్థి దేశం శాంతి, గౌరవంతో వ్యవహరిస్తుందని ఆయన వివరించారు.

# ఏసీబీకి పట్టుబడిన గోల్నాకా అసిస్టెంట్ ఇంజనీర్!

**హైదరాబాద్,జూన్ 23,తెలంగాణ దిశ:** లంచం తీసుకోవడం నేరం అని ప్రభుత్వం హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు ప్రభుత్వ అధికారుల తీరు మాత్రం మారడం లేదు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచన కావొచ్చేమో కొందరు ఉద్యోగులు లంచాలకు ప్రాధాన్యత నిస్తున్నారు. ఇలాంటి వారిని ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని చర్యలు తీసుకుంటున్నప్పటికీ మార్పు రావడం లేదు. తాజాగా జిహెచ్ఎంసి గోల్నాకా అసిస్టెంట్ ఇంజనీర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడింది. బిల్లు ప్రాసెస్ చేసి పైకి పంపించడానికి రూ. 20 వేలు లంచం డిమాండ్ చేసింది గోల్నాకా అసిస్టెం ట్ ఇంజనీర్ మనీషా. రూ. 5 వేలు అడ్వాన్స్ ఇచ్చి.. మిగతా రూ. 15 ఇచ్చే ముందు ఏసీబీ కి పట్టించారు బాధితులు. లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ ఇంజనీర్ మనీషా ను అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు ఏసీబీ అధికారులు.

## కాళేశ్వరం కమిషన్‌కు
# క్యాబినెట్ మినిట్స్

నేడు రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా విజయోత్సవాలు

- అన్ని జిల్లాల కలెక్టరేట్‌లో తెలుగుతల్లి విగ్రహాలు-పీసీ ఘోష్ కమిషన్‌కు మినిట్స్‌తో కూడిన నివేదిక

-సీయం రేవంత్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ నిర్ణయాలు



**హైదరాబాద్,జూన్ 23,తెలంగాణ దిశ:** రాష్ట్రంలో కీలక పరిణామాలు జరుగుతున్న వేళ సమావేశమైన రేవంత్ మంత్రివర్గం కొన్ని కీలక నిర్ణయాలను తీసుకుంది. ఇంకా కేబినెట్ సమావేశం కొనసాగుతున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుతోపాటు పలు అంశాలపై మంత్రి మం డలి సుదీర్ఘంగా చర్చిస్తోంది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రీజినల్ రింగ్ రోడ్డు సౌత్ అలైన్‌మెంట్‌కు ఆమోదం నాలుగు గంటలకు పైగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో విధాన పరమైన నిర్ణయాలు తీసుకున్నారు. కాళేశ్వరం కమిషన్ కు క్యాబినెట్ మినిట్స్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ వారంలో కమిషన్ కు సమాచారం ఇవ్వనుంది ప్రభుత్వం . మంత్రివర్గం లో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ నెల 16 న సీఎం రేవంత్ చెప్పిన మాట ప్రకారం రైతు భరోసా అమలు చేశామన్నారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రుణమాఫీ రేపటితో అమలు చేస్తున్నట్లు వెల్లడిచారు. ఇందిరమ్మ ప్రభుత్వంలోనే ఇది సాధ్యమైందన్నారు. రేపు రైతు భరోసా విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. రైతులతో విజయోత్సవ సభ ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో పండుగలా నిర్వహిస్తామన్నారు. అన్ని కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో రైతు భరోసా పంపిణీ, ఏపీ తలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడానికి తదుపరి కార్యాచరణపై మంత్రివర్గం చర్చించింది. త్వరలో సిఎల్పీ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సిఎల్పీ లో పార్టీ నేతలకు బనకచర్ల పై ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. ముందు ఏపీ తో చర్చలు జరపాలని నిర్ణయం తీసుకుంది రేవంత్ సర్కార్. రీజనల్ రింగ్ రోడ్డు సదరన్ పార్ట్ అలైన్మెంట్ కు కేబినెట్ ఆమోదం తెలిపింది. రేపు సాయంత్రం 6 గంటలకు సచివాలయం ఎదురుగా రైతు నేస్తం సభ నిర్వహించాలని నిర్ణయించింది. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు పాల్గొనాలని సూచించింది. సచివాలయం దగ్గర జరిగే సభకు మంత్రులు హాజరుకావాలని నిర్ణయం.. 2 వేల మందితో సభ నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించింది. నవంబర్ 9 వరకు ఏర్పాటు చేయాలని కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నామన్నారు. సంగారెడ్డి–చౌటుప్పల్ వరకు –కు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. బనకచర్ల బంకను మా ప్రభుత్వానికి రుద్దాలని బీఆర్ఎస్ చూస్తోందని ఆయన ఆరోపించారు. గోబెల్స్ ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ పై మండిపడ్డారు. బనకచర్లపై తెలంగాణ వాటాలో ఉన్న ఒక్క చుక్కను కూడా వదులుకోమని, ఎంతవరకైనా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బనకచర్లకు గత ప్రభుత్వంలో పునాది వేశారని, వారి తప్పును కప్పి పుచ్చుకునేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. జూలై మొదటి వారంలో బనకచర్లపై ప్రజాప్రతినిధులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుందన్నారు. ప్రాజెక్ట్ ను అడ్డుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తామన్నారు. బనకచర్లపై హైలెవల్ అధికారుల కమిటీ చర్చ చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. . నాటి కేబినెట్‌తో పాటు, సబ్ కమిటీకి సంబంధిం చిన పూర్తి వివరాలను కమిషన్ కు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ నెల 30వ తేదీ వరకు కమిషన్ కు వివరాలు అందిస్తామన్నారు. స్పోర్ట్స్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 2047 రైజింగ్ తెలంగాణ విజన్ కు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసిందన్నారు. ప్రతి నెలకు రెండు సార్లు క్యాబి నెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు.

# మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్

## రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే
# చేతలు గడప దాటవు

### కాంగ్రెస్ హామీలపై ధ్వజమెత్తిన హరీశ్‌రావు



**హైదరాబాద్,జూన్ 23,తెలంగాణ దిశ:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వపాలనలో అన్ని పథకాలు బంద్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఆయన ట్వీట్‌లో.. "సన్నాలకు బోనస్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గ్యాస్ బండకు రాయితీ, రాజీవ్ యువ వికాసం అమలుకు కాకముందే బంద్, గొర్రెల పంపిణీ మొత్తానికే బంద్.. ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పాలన లో అన్ని పథకాలు బంద్ అయ్యాయి. మేనిఫెస్టోలో ఊదరగొట్టిన హామీల అమలును గాలికి వదిలేశారు. రేవంత్ రెడ్డి మాటలుకోటలు దాటితే చేతలు గడప దాటవు. ప్రజలను నమ్మించడం, నయవంచన చేయడంలో కాంగ్రెస్ బ్రాండ్ అంబాసిడర్ గా మారిందని హరీష్ రావు ఫైర్ అయ్యారు. పాలన అంటే ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు తీర్చుకోవడం కాదని అన్నారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గొర్రెల పంపిణీ చేస్తామని అభయహస్తం మేనిఫెస్టోలో పెట్టాడు. కానీ ప్రస్తుతం గొర్రెల పంపిణీ దేవుడెరుగు, కట్టిన డిడి పైసలు కూడా వాపస్ ఇవ్వలేని దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానిది అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి మాటలు విని విని విసిగి పోయిన యాదవ, కురుమ సోదరులు గాంధీ భవన్‌కు గొర్రెలు తోలుకొని వచ్చి నిరసన తెలియచేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని గుర్తించి, అన్ని వర్గాల ప్రజలు ఏకమై గాంధీభవన్‌కు పోటెత్తకముందే కళ్లు తెరవాలని, చెప్పిన గ్యారెంటీలు, ఇచ్చిన హామీలు ఇకనైనా అమలు చేయకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని మాజీ మంత్రి తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.

# మావోయిస్టులను నిద్రపోనివ్వను

## వర్షాకాలంలోనూ కేంద్ర ఆపరేషన్ కొనసాగుతుంది

### -హోంమంత్రి అమిత్ షా హెచ్చరిక



**రాయ్‌పూర్,జూన్, 23:** మావోయిస్టులు సాధారణగా వర్షాకాలంలో విశ్రాంతి తీసుకుంటారని, కానీ ఈ వర్షాకాలంలో కూడా మావోయిస్టులను నిద్రపోనివ్వనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. వర్షాకాలంలో కూడా ప్రభుత్వ ఆపరేషన్ కొనసాగుతుందని హెచ్చరించారు. చర్చల ప్రసక్తే లేదన్న మంత్రి.. అడవుల్లో ఉన్న మావోయి స్టులంతా ఆయుధాలు వదిలి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని, అభివృద్ధికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. చత్తీస్‌గఢ్‌లోని నవా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ(ఎన్ఎఫ్ఎస్‌యూ)కి ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే సెజ్‌బహార్‌లోని ఎన్ఎఫ్ఎస్‌యూ ట్రాన్సిట్ క్యాంపస్‌ను, ఛత్తీస్‌గఢ్‌లోని ఐ–హబ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం షా మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి చివరికల్లా నక్సలిజాన్ని అంతం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను కూడా అమలు చేస్తామన్నారు. అవసరమైతే అంతకన్న ఎక్కువ సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలను పూర్తిగా అమలుతో మన దేశ నేర న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత ఆధునిక, వేగవంతమైన, శాస్త్రీయ న్యాయ వ్యవస్థగా మారుతుందని షా అన్నారు. నవ రాయ్‌పూర్‌లోని ఎన్ఎఫ్ఎస్‌యూ క్యాంపస్‌కు రూ. 145 కోట్లు, సీఎఫ్ఎస్ఎల్‌కు రూ. 123 కోట్లు ఖర్చవుతుందని, ఇవి మూడు సంవత్సరాలలో అందుబాటులోకి వస్తాయన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, ఆర్థిక పురోగతిపైనే కాకుండా సకాలంలో న్యాయం అందించడంపైనా దృష్టి పెడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రులు అరుణ్ సావో, విజయ్ శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జూరాలకు నిలకడగా వరద

**ధరూరు: జూన్ 23:,తెలంగాణ దిశ:** ప్రియదర్శిని జూరాల రిజర్వాయర్‌కు నిలకడగా వరద కొనసాగుతున్నదని ప్రాజెక్టు అధికారులు చెప్పారు. జలాశయంలో 8.869 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆదివారం 53 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదైంది. దిగువకు 50,467 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రెండు జల విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో 90.033 మిలియన్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నది. ఎడమ కాలువ, కుడి కాలువ, ఆర్డీఎస్ లింక్ కెనాల్, సమాంతర కాల్వకు కలిపి 4,135 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

## తెలంగాణలో బోనాల జాతర ఏర్పాట్లు ముమ్మరం



**హైదరాబాద్,జూన్ 23,తెలంగాణ దిశ:** తెలంగాణ ప్రజలు అత్యంత గ్రాండ్‌గా జరుపుకునే పండుగల్లో బోనాల పండుగఒకటి. ఈ సంవత్సరం బోనాల జాతర మరికొన్ని రోజుల్లో ప్రారంభం కాబోతోంది. ఈ క్రమంలోనే అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. తాజాగా.. బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. జూలై 13వ తేదీన జరిగే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, అర్చకులు డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.

# నేటితో రైతు భరోసా నిధుల విడుదల పూర్తి..

## మంత్రి తుమ్మల కీలక ప్రకటన



**హైదరాబాద్,జూన్ 23,తెలంగాణ దిశ:** సాగులో ఉన్న ప్రతి గుంటకు రైతు భరోసా నిధులు జమ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటివరకు 67.01 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 8284.66 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసినట్లు తెలిపారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగులో ఉన్న మిగతా భూములకు కూడా రైతు భరోసా నిధుల ప్రక్రియను రేపటి వరకు పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు ఇవాళ కీలక ప్రకటన విడుదల చేశారు. రైతుకు భరోసా.. రేవంతన్న అనేలా ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే వానాకాలం రైతు భరోసా ప్రక్రియను పూర్తి చేసి, రైతులపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. జూన్ 16 న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకున్న రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు రెండు ఎకరాల వరకు రూ. 2349.83 కోట్లు, రెండో రోజు 3 ఎకరాల వరకు 3901. 73 కోట్లు, మూడో రోజు 4 ఎకరాల వరకు 5215.26 కోట్లు, నాలుగో రోజు 5 ఎకరాల వరకు 6404.70 ఎకరాలు, ఐదో రోజు 7 ఎకరాల వరకు 7310.59 కోట్లు, ఆరో రోజు 9 ఎకరాల వరకు 7770.83 కోట్లు, ఏడో రోజు 15 ఎకరాల వరకు 8284.66 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇంత తక్కువ రోజుల్లోనే రైతుభరోసా నిధుల జమ ప్రక్రియను పూర్తి చేయడం రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటిసారి అని వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్న.. ఎలాంటి రాజీ పడకుండా వానాకాలం రైతుభరోసా పథకాన్ని పూర్తిచేసిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆనందంలో మునిగిపోయారని అన్నారు. ఇప్పటికే రైతుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందని, కానీ ఇవేమి కనబడని ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా మా ప్రభుత్వం రైతులకు చేస్తున్న మంచిని గ్రహించి దురుద్దేశంతో చేసే విమర్శలు మానుకోవాలని, హితవు పలికారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రైతుభరోసా నిధులను ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే పూర్తి చేసిన సందర్భంగా, సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రైతుపండగ కార్యక్రమంలో సాయంత్రం 6 గంటలకు రైతులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతారని తెలిపారు.

## గుజరాత్‌ను ముంచెత్తిన
# భారీ వరదలు

**గాంధీనగర్, జూన్ 23:** గుజరాత్‌లో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇక సూరత్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. రహదారులన్నీ జలమయం అయ్యాయి. దీంతో స్కూళ్లకు అధికారులు సెలవులు ప్రకటించారు. భద్రతా దృష్ట్యా జిల్లా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. భారీ వరదలు కారణంగా విద్యార్థులను బయ టకు రానివ్వొద్దని.. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం కోరింది. 24 గంటల్లో దాదాపు 6 అంగుళాల వర్షం కురిసినట్లుగా ఐఎండీ పే ర్కొంది. సూరత్, వల్సాద్, జామ్‌నగర్, జునాగఢ్ వంటి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తు న్నాయని భారత వాతావరణ శాఖ తెలి పింది. దీంతో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది.



# తెలంగాణది దేశంలోనే ఆదర్శవంతమైన క్రీడా విధానం






హైదరాబాద్, జూన్ 23, (తెలంగాణ దిశ) :తెలంగాణ క్రీడా శాఖ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ సమన్వయంతో సోమవారం ఒలంపిక్ డే రన్ 2025 విజయవంతంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ఒలంపిక్ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకపోవడానికి “డిపార్ట్ మెంట్ ఆఫ్ స్పోర్ట్స్” స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఒలంపిక్ డే రన్ ఒక్క రోజు మాత్రమే కాకుండా ఆరు రోజులపాటు సెలబ్రేషన్ నిర్వహించింది. గత ఆరు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు విజయవంతంగా కొన సాగాయి. జంట నగరాల్లోని స్పోర్ట్స్ స్టేడియాలతో పాటు 33 జిల్లా కేంద్రాల్లో రోజుకొక క్రీడా స్ఫూర్తి కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా నిర్వహించారు. మొట్ట మొదటిసారిగా జంట నగరాల నుండి 14 కేంద్రాల నుండి ఒలంపిక్ డే రన్ ఎల్ బి స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ కు చేరుకున్నాయి. 14 కేంద్రాల నుండి ప్రారంభమైన ఈ రన్ కార్యక్రమంలో అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు ఒలంపియన్లు జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బందితోపాటు యువ క్రీడాకారులు విద్యార్థులు ఒలంపిక్ డే రన్ ఉత్సవాలలో తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 14 క్రీడ జ్యోతులకు ఒక్కొక్క క్రీడాజ్యోతికి ఒక్కొక్క తెలంగాణ క్రీడ ఆణి ముత్యాల పేరు మీదుగా, వారి క్రీడా సేవలను విద్యార్థులలో స్ఫూర్తి కలిగించే విధంగా కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, అతిథులుగా యువజన అభివృద్ధి పర్యాటక సంస్కృతిక, క్రీడల రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయష్ రంజన్ ఐఏఎస్, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడలు, యువజన అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగంలో తీసుకువచ్చిన మార్పులు యావత్ క్రీడా సమాజం హర్షం వ్యక్తం చేస్తుందని, దేశంలోనే ఆదర్శవంతమైన క్రీడా విధానం రాష్ట్రంలో అమలు కాబోతుందని ఆయన తెలిపారు. నగదు పురస్కారాలు, క్రీడా రిజర్వేషన్లు పెంపుతో పాటు ఒక సుదీర్ఘ కాల క్రీడాభివృద్ధి అంచలంచలుగా ఫలితాలు సాధించే విధానంతో సమగ్రమైన క్రీడా విధానం తెలంగాణ రాష్ట్రంలో అమలు కాబోతుందని ఆయన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం అకుంఠిత దీక్షతో పని చేస్తామని, క్రీడలకు ప్రాధాన్యతను మరింతగా విస్తరిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయష్ రంజన్, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల ఉత్తరాఖండ్ లో జరిగిన 38వ జాతీయ క్రీడలలో పాల్గొని తెలంగాణ రాష్ట్రానికి పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు 84 లక్షల రూపాయల నగదు పురస్కారాన్ని అందజేశారు. అంత ముందుకు 14 కేంద్రాల నుండి విచ్చేసిన ఒలంపిక్ డే రన్ క్రీడాజ్యోతి లను వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జుంబా డాన్స్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడాకారులను అలరించాయి. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో ఐజి స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ ఎం రమేష్, డబుల్ ఒలంపియన్ మంజిత్, అర్జున అవార్డు గ్రహీతలు మిగతా దడ్ వే అనుప్ కుమార్ యామ, పారా ఒలంపియన్ దీప్తి జీవన్ జీ, ఇంటర్నేషనల్ అథ్లెట్ నందిని ఆగసర, మహిళా క్రికెటర్ గొంగిడి త్రిష వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు...



## నేడు నాగారంలో విద్యుత్తు అంతరాయం కలిగే ప్రాంతాలు




నాగారం, జూన్ 23, (తెలంగాణ దిశ) :విద్యుత్ మెయింటెనెన్స్ కారణంగా మంగళవారం 11 కెవి పీటర్ల పరిధిలోనిపలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నాగారం విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎ. రాజేంద్ర ప్రసాద్తెలిపారు. ఇందులో భాగంగా 11 కెవి ఆర్ జీకే అహ్మద్ గూడ ఫీడర్ 33/11 కెవి అహ్మద్ గూడ (ఆర్ జికె) ఉప–స్టేషన్ నుండి 10 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఆర్ జికె, డబుల్ బెడ్ రూమ్ గృహాలు, హరిదాస్ పల్లి, సింధు వాన్ కాలనీ గురుకుల్ స్కూల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. అదే విధంగా 11 కెవి ఎస్ వి నగర్ ఫీడర్ 33/11 కెవి చక్రిపురం ఉప–స్టేషన్ నుండి 2 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఉ షోదయ కాలనీ, రేణుకా యెల్లమ్మ కాలనీ, ఎస్ వి నగర్, పిఎంఆర్ ఎన్క్లేవ్, ఎస్ ఎంహెచ్ ప్లాజా, వెంకటాద్రి కాలనీ, మామిల్లా నారాయణ కాలనీ, విఎస్ఎన్ గార్డెన్స్, బ్రహ్మయ్య కాలనీ, ఈశ్వరపురి కాలనీ, సాయి నివాస్ నాగర్, జి పికోనీ, సాయి శ్రీ షుక్లా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## జిల్లాలో 5116 మంది రైతుల ఖాతాల్లో రూ. 4.61 కోట్లు జమ




మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 23, (తెలంగాణ దిశ) :రైతు భరోసాతో రైతుల ఖాతాల్లోకి నిధులు అందించి రైతుల ముఖాల్లో సంతోషాన్ని చూస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. సోమవారం వరకు రైతు భరోసా పథకం ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 5116 మంది రైతుల ఖాతాల్లో రూ. 4.61 కోట్లు జమ అయిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ముఖాల్లో సంతోషం కోసం రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్ కంటె ముందుగానే రైతుల ఖాతల్లో నిధులు జమ చేయడం రైతుల మంచి భవిష్యత్తుకు మచ్చు తునక అన్నారు. విడతల వారిగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడతాయని, వ్యవసాయానికి పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడం పై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కాప్రా తహసిల్దార్ కార్యాలయంలో దళారుల దందా

- అక్రమ నిర్మాణాలకు, సర్టిఫికెట్లకు ప్రత్యేక “రేట్లు”
- రెవిన్యూ ఇన్ స్పెక్టర్ పై అవినీతి ఆరోపణలు







కాప్రా, జూన్ 23, (తెలంగాణ దిశ) :కాప్రా తహసిల్దార్ కార్యాలయం దళారులకు అడ్డగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసులు కురిపిస్తే ఏ సర్టిఫికెట్ అయినా క్షణాల్లో మంజూరు అవుతుందని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇటీవల కార్యాలయంలో జరుగుతున్న సంఘటనలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. ప్రతి సర్టిఫికెట్ కు ఒక రేటు నిర్ణయించి దళారులు దందా చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. అదే విధంగా మండల పరిధిలోని జవహర్ నగర్ లో అక్రమ నిర్మాణాలకు రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో నిర్మాణానికి ఒక్కోరకంగా రెవిన్యూ ఇన్ స్పెక్టర్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇటీవల అక్రమ నిర్మాణాలపై కొరడా జలుపిస్తున్న రెవెన్యూ అధికారులు, మరో వైపు కింది స్థాయి సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న చర్యలు చేపట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ అక్రమ నిర్మాణాల పేరిట కూల్చి వేస్తున్నా..., వసూళ్లు చేసిన వారు రక్షించడం లేదని బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్ దృష్టికి బాధితులు తీసుకువెళ్లారు. దీంతో సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదల వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ అక్రమ నిర్మాణాలు పేరిట కూల్చి వేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రెవిన్యూ ఇన్ స్పెక్టర్ సాయి అక్రమ వసూళ్లపై బహిరంగ విమర్శను వెల్లు వెత్తినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల జవహర్ నగర్ వాసులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక తహసిల్దార్ సుచరితతో వాగ్వాదానికి దిగారు. అవినీతి అక్రమాలకు పాల్పడకుంటే బూతు బంగ్లాలా ఉన్న తహసిల్దార్ కార్యాలయాన్ని ఎలా ఆధునికరిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పేరుకు మాత్రం ప్రభుత్వ స్థలాలను పరి రక్షిస్తున్నానని చెప్పుకుంటున్న తహసిల్దార్ రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మరో వైపు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు. ఏ విషయంపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.

## ప్రజావాణికి 117 దరఖాస్తులు



మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 23, (తెలంగాణ దిశ) :ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డిఆర్ఓ హరిప్రియతో కలిసి కలెక్టర్ 117 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసల కోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే ధరఖాస్తుల గురించి అర్జీదారులకు ఎందుకు తిరస్కరిస్తున్నామనే విషయాన్ని తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలి

- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్, జూన్ 23, (తెలంగాణ దిశ) :గాజుల రామారం డివిజన్ గాజుల రామారం గ్రామ చౌరస్తాలో రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు అడ్డంగా ఉండి ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతులు, రవాణా వ్యవస్థలు అత్యంత కీలకమని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా షాపూర్ నగర్ ఉషోదయ టవర్స్ చౌరస్తా, కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా లతో పాటు గాజుల రామారం చౌరస్తాలను అభివృద్ధి పరిచామని అన్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన విద్యుత్ అధికారులను రోడ్డుపక్కకు స్తంభాలను మార్చకపోవడంపై అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడిన రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉండి అనేక ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలను వెంటనే పక్కకు మార్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎం. లక్ష్మణ్, పి. యాదగిరి యాదవ్, పెంటయ్య, శివయ్య, గోవర్ధన్, సురేష్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సాయి బాబా, చెట్ల వెంకటేష్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, వాహిద్, గోవర్ధన్ రెడ్డి, శివా నాయక్, ఆసిఫ్, చంద్ర గౌడ్, ప్రసాద్, జునైద్ తదితరులు పాల్గొన్నారు.



## చక్రిపురం కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





చర్లపల్లి, జూన్ 23, (తెలంగాణ దిశ) :చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం కాలనీ 215 సర్వేనెంబర్ రిజిస్ట్రేషన్ కాకుండా కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్న దృష్ట సమస్యపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించారు. ఈ సమస్యపై కాలనీ వాసులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాలనీలో మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షులు మొగిలి రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కట్కూరి బుచ్చిరెడ్డి, నాయకులు కొండారెడ్డి, అశోక్, వెంకటేష్, సంతోష్ గుప్తా, మాన్,ఆంజనేయులు, గంగిరెడ్డి, రామ్ రెడ్డి, రణధీర్ రెడ్డి, సహదేవ్ గౌడ్, పాండు, జనార్ధన్, నాగరాజు, వెంకటేష్ గుప్తా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలి దివాస్



కుత్బుల్లాపూర్, జూన్ 23, (తెలంగాణ దిశ) :భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలి దివాస్ సందర్భంగా సోమవారం నిజాంపేట బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్ నిజాంపేట్ లోని హనుమాన్ టెంపుల్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆ మహనీయుడి సేవలను గుర్తు చేసుకుంటూ అతని చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. తర్వాత అతని సేవలను గుర్తు చేసుకుంటూ మొక్కలు నాట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి మోర్చా అధికార ప్రతినిధి దాస్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి సచిన్, పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, జిల్లా ఓబీసీ మోర్చా సెక్రెటరీ రవి యాదవ్, జిల్లా బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, నిజాంపేట్ సెక్రెటరీ కౌశిక్ నాయుడు, ఓబిసి మోర్చా అధ్యక్షులు వెంకటేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు వేణు, ఈశ్వరరావు, బీజేవైఎం రఘు పాల్గొన్నారు



# సంపాదకీయం

## డాలర్ డ్రీమ్స్ కు కష్టాలు..!

అమెరికాలో 1958లో కేవలం 12,000 మంది మాత్రమే ప్రవాస భారతీయులు ఉండేవారు. రానురాను వారి ప్రాముఖ్యత పెరిగి ఇప్పుడు అమెరికా మొత్తం జనాభాలో 1.5% వరకు ప్రవాస భారతీయులు ఉనికిని పొందడం విశేషం. సిఇఒలుగా,సైంటిస్టులుగా, ఆస్ట్రోనాట్లుగా, విధానపర నిర్ణేతలుగా, చట్టసభ సభ్యులుగా ఇలా అనేక రంగాల్లో ప్రవాస భారతీయులు విస్తరిస్తుండటంతో అమెరికాలో పుట్టి పెరిగిన అసలైన అమెరికన్లకు దక్కవలసిన ఉద్యోగాలు, పదవులు ప్రవాసీయులకే దక్కుతున్నాయన్న అపోహలు మొదలవుతున్నాయి. ఇది చివరకు హెచ్1బి వీసాలపై ప్రభావం చూపిస్తోంది. మేక్ ఎగైన్ గ్రేట్ అమెరికా 'మాగా' నినాదంతో రెండోసారి విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు హెచ్1బి వీసాల వివాదం అగ్నిపరీక్షగా మారింది.ప్రవాసీయుడైన ఎలాన్ మస్క్‌కు పెద్ద పీట వేయడం వివాదాస్పదమవుతోంది.ఇది మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) అన్న ట్రంప్ ప్రధాన నినాదానికి తూట్లు పొడుస్తోంది. న్యూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీసియెన్సీ(డిఒజిఇ) అధినేతగా ఎలాన్‌మస్క్, ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్, పౌరహక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా హర్మీత్ కె ఢిల్లాన్, జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్‌గా డాక్టర్ జయభట్టాచార్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సీనియర్ పాలసీ అడ్వైజర్ శ్రీరామ్ క్రిష్ణన్‌తో పాటు వివేక్ రామస్వామి వంటి భారతీయ మూలాలున్న ఆరుగురిని ట్రంప్‌తన యంత్రాంగంలో కీలక స్థానాల్లో నియమించారు. ఇది'మాగా' నినాదానికి విరుద్ధమని వలసవాద, ఇస్లామిక్ వ్యతిరేక ఉద్యమ నేత లారా లూమెర్ ధ్వజమెత్తుతున్నారు.ట్రంప్ నియమించిన వారిలో శ్రీరామ్ క్రిష్ణన్ చెన్నైకు చెందినవారు. ఇండియా ఫస్ట్ అన్న నినాదానికి ఆయన కట్టుబడి ఉన్నారని, ఇది 'అమెరికా ఫస్ట్ అన్న లక్ష్యానికి వ్యతిరేకమని లారా లూమెర్ ఆగ్రహిస్తున్నారు. అయితే హెచ్1బి వీసాల్లో 70% భారతీయు లే పొందుతున్నారని, వీరంతా భారత్ నుంచి వచ్చే మూడో ప్రపంచ ఆక్రమణదారులని లూమెర్ ఆరోపిస్తున్నారు. హెచ్1బి వీసాదారుల్ని కాంట్రాక్టుగా తీసుకోవడంలో ఎలాంటి ప్రత్యేక నైపుణ్య ప్రమాణాలు కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. పైగా ఏటా వారికి 80వేల డాలర్ల నుంచి 1,20,000 డాలర్ల వరకు చెల్లించుకోవలసి వస్తోందని నిలదీస్తున్నారు. ఈ వాదాన్ని వివేక్ రామస్వామి, ఎలాన్ మస్క్ తదితరులు తిప్పికొడుతున్నారు.వాస్తవానికి ఎలాన్ మస్క్ దక్షిణాఫ్రికా నుంచి అమెరికాకు హెచ్1బి వీసా పైనే వచ్చారు.విదేశీ ప్రతిభతో అమెరికా ప్రయోజనం పొందుతుంది తప్ప అమెరికా వాసుల ప్రయోజనాలకు, హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని మస్క్, రామస్వామి తమ వాదన వినిపిస్తున్నారు. చేతిలోపైసా లేకుండా అమెరికాకు వలస వచ్చిన గొప్ప ఇంజినీర్ నికోలా టెస్లా స్ఫూర్తితోనే తన కారుకు టెస్లా అని పేరు పెట్టినట్టు మస్క్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికాలో విద్యుత్ విప్లవానికి నికోలా టెస్లా మూలకారకుడని మస్క్ ఉదహరించారు. అమెరికాకు సమర్థత కలిగిన ప్రజలు కావాలని తానెల్లప్పుడూ భావిస్తానని, తెలివైనవారు మన దేశానికి రావాలని, ఇదివరకెన్నడూ లేని స్థాయిలో అమెరికాలో ఉద్యోగాలు రాబోతున్నాయని కొత్త సంవత్సరం సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడడం ఈ సందర్భంగా గమనించాల్సిన విషయం. అమెరికా తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తున్నందున ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే నైపుణ్యం గల వారిని దేశంలోకి అనుమతించడానికి హెచ్1బి వీసా ఉపయోగపడుతుందని మస్క్, వివేక్ రామస్వామి కూడా పేర్కొంటున్నారు.ప్రపంచ దేశాల్లో అమెరికా ఎప్పటికీ మొదటి స్థానంలో ఉండాలంటే ఈ ప్రోగ్రాంకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలికగా నియమించుకోడానికి అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ బైడెన్ కార్యవర్గం నిబంధనల్లో మార్పులు చేసింది. ట్రంప్ మొదటిసారి పాలనలో వీసాలపై ఉన్న అభిప్రాయాలకు ఇప్పటి వైఖరికి తేడా కనిపిస్తోంది. 2017లో బై అమెరికన్, హైర్ అమెరికన్ అన్న సిద్ధాంతానికి వత్తాసు పలికారు. ఫలితంగా 2015 నుంచి హెచ్1బి వీసాల మంజూరు మందగించింది. 2020లో అమెరికాలోనిసంస్థలు విదేశాల నుంచి ఉద్యోగులు, కార్మికులను తెచ్చుకునే విధానానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నిలకడలేని విధానాలతో మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) మద్దతుదారులు హెచ్1బి వీసా అసలు ప్రయోజనాలను తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది.ఈ సమస్యను ట్రంప్ ఈసారి ఎలా పరిష్కరిస్తారో చూడాలి. హెచ్1బి వీసాలపై ఆంక్షలు ఎక్కువ చేస్తే అమెరికా కంపెనీలు విదేశాల్లో అనుబంధ సంస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. ప్రత్యామ్నాయంగా చైనా, కెనడా వంటి దేశాల వైపు మొగ్గు చూపే పరిస్థితి ఏర్పడుతుందని మరో అధ్యయనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ పాలనా యంత్రాంగంలో 'మాగా' గ్రూపు ఆలోచనలను మార్చడానికి భారత ప్రభుత్వం గట్టిగానే పని చేయవలసి వస్తుంది. భారత్‌కు ఆదాయం తెచ్చిపెట్టే దేశాల్లో అమెరికా టాప్‌లో ఉంది. గత ఏడాది 120 బిలియన్ డాలర్లవరకు భారత్‌కు అమెరికా నుంచి ఆదాయం సమకూరింది. ఈ ఆదాయ స్రవంతిని భారత్ దొరకబుచ్చుకోగలగాలి. అలాగే అమెరికాను ఆకర్షించడానికి సాంకేతిక నైపుణ్యంలో టాప్‌లో భారతీయులు ఉన్నప్పుడే ఎలాంటి చిక్కులు వీసాల్లో ఎదురుకావు.


# హవా అంతా వార్డు సిబ్బందిదే

**- అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేదు**
**- దమ్మాయిగూడ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు వత్తాసు**
**- మేడ్చల్ అదనపు కలెక్టర్, ప్రత్యేక అధికారి చూసి చూడనట్లు వివరిస్తున్న వైనం**
**- కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదులు చెల్లవా..**





**కీసర, జూన్ 23, (తెలంగాణ దిశ)** :అక్రమ నిర్మాణాలకు అడ్డుకోవాల్సిన అధికారులే సహకరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని అధికారులు జేబులో వేసుకుంటున్నారని... వసూళ్ల కోసం ప్రత్యేకంగా ఆఫీసర్లను కలెక్షన్ ఏజెంట్లు వాడుకుంటున్నారని దమ్మాయిగూడ మున్సిపల్ అధికారులు యుదేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నారని విమర్శలు గుప్పుమంటున్నాయి.నిర్మాణాలకు నిబంధనల ప్రకారం అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు అవసరం లేదు. స్థానికంగా మున్సిపల్ అధికారులను చూసుకుంటే పలు నిర్మాణాలు చేపట్టొచ్చనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు అనుమతులు కావాలంటే వార్డు ఆఫీసర్ మహేష్ అని ఉంటారూ కలవండి. అంటూ ఓ అధికారి చెప్పడం విశేషం. దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ఇంత బహిరంగంగా అవినీతి పేరుకపోతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇందులో భాగంగానే ఇక్కడ చూస్తున్న అక్రమ నిర్మాణాలే నిదర్శనం.. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని యాద్గార్ పల్లి విలేజ్ గండి చెరువు సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా భారీ ఫామ్ హౌస్ నిర్మాణం నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా వెలుగులోకి వచ్చిన కొన్ని మాత్రమే. ఇలా అక్రమ నిర్మాణాలకు



Prajavani Acknowledgement Receipt

| | |
|---|---|
| Name | :Kameshwar Rao |
| Mobile No. | : 9959787496 |
| Address | :Dammiguda,Dammiguda,Dammiguda |
| Village | :DAMMAIGUDA |
| Mandal | :KEESARA |
| Grievance Subject | :Requests |

Your Grievance is Registered vide Registration no.MDDIO/E/2025/00053 On23-06-2025Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to District Irrigation Officer

కేరాఫ్ గా దమ్మాయిగూడ మున్సిపాలిటీ నిలుస్తుందంటే... మేడ్చల్ అదనపు కలెక్టర్ ప్రత్యేక అధికారి ఏం చేస్తున్నారు? అనేది అర్థం కావడం లేదు.అవినీతిలో వాటాలు పంచుకుంటున్నారా? అనేది అంతుచిక్కడం లేదు.ఇకనైనా మేడ్చల్ జిల్లా కలెక్టర్ సంప్రదించి మున్సిపాలిటీలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకట్ట వేయాల్సిందిగా స్థానిక ప్రజలు కోరుతున్నారు.



# వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో ఉచిత నోటు పుస్తకాల పంపిణీ







**కుషాయిగూడ, జూన్ 23, (తెలంగాణ దిశ)** :వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో దాతల సహకారంతో సోమవారం శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల కుషాయిగూడలో నోటు పుస్తకాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త హాజరై బడి పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి రామిణి తిరుమలేష్ గుప్తా, కార్యనిర్వాక కార్యదర్శి గంప కృష్ణ గుప్తా సహకరించిన దాతలు పెద్ది నాగరాజు గుప్తా, అమర కృష్ణ గుప్తా, అనుములు నర్సింగ్ రావు గుప్త, బచ్చు నగేష్ గుప్తా, రాయల శ్రవణ్ కుమార్ గుప్తా, రాయికంటి ముత్యాల గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, చందా సంతోష్ గుప్తా, కూర శ్రీనివాస్ గుప్తా, ఎనిశెట్టి మురళి గుప్తా, వి బి వి కృష్ణ గుప్తా,వైవియు నాగేశ్వరరావు గుప్తా, మాచర్ల హనుమంతరావు గుప్తా, లింగా రామచంద్ర గుప్తా, చంద్రగిరి తారకేశ్వర్ గుప్తా, బెల్దే భగవాన్ గుప్తా, దిడిగం కైలాసం గుప్తా, రాయల సంతోష్ గుప్తా, అర్థం శ్రీనివాస్ గుప్తా, జగ్గయ్యగారి బాలలింగం గుప్త, రాజూరి జగదీష్ గుప్తా, బిల్దే నాగరాజు గుప్తా, సముద్రాల హరినాథ్ గుప్త, కార్యదర్శి బాచెల్లి నవీన్ గుప్తా, సభ్యులు నంబూరి నాగేందర్ గుప్తా, ఉప్పల ఆంజనేయులు గుప్తా, కందే శివగుప్త, ప్రధానోపాధ్యాయురాలు రాధిక, సెక్రెటరీ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**కాప్రా, జూన్ 23, (తెలంగాణ దిశ) :**
తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.సోమవారం కాప్రా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పర్యటించారు. కాప్రా డివిజన్ లో మంజూరు చేయించిన పనులను పరిశీలించడంతో పాటు కాలనీల సమస్యలు తెలుసుకోవడానికి సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు .అశోక్ ఎంక్లేవ్ పార్క్ షిరిడి నగర్ సిసి రోడ్స్ శ్రీ సాయి ఎన్ క్లేవ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గౌరీనాథ్ పురం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎన్ ఆర్ ఐ కాలనీ సీసీ రోడ్స్ మల్లికార్జున్ నగర్ సిసి రోడ్స్ శ్రీ సాయి శివ నగర్ (ఆర్టీసీ కాలనీ ) వినాయక నగర్ ఫేస్ 3 లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో అధికారులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నేడు మహా ధర్నా...

## ST.ANNE'S స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ ధర్నా




**కుషాయిగూడ, జూన్ 23, (తెలంగాణ దిశ):** ST.ANNE'Sను ST.ANN'Sగా బోర్డు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ మంగళవారం వివిధ సంఘాలు మహా ధర్నాకు పిలుపు నిచ్చాయి. ఉదయం 10 గంటలకు స్కూల్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. వివిధ విద్యార్థి సంఘాలతో పాటు స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా స్కూలు పేరు మార్చడంపై తలెత్తిన వివాదం కారణంగా స్కూల్ యజమాన్యం బోర్డు మార్చింది. ST.ANNE'S స్థానంలో ST.ANN'S గా మారుస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీనికి తోడు గత నాలుగు నెలలుగా బోర్డుపై ఉన్న సిబిఎస్ సి అనే అక్షరాలను తొలగించారు. స్కూల్ ను రెసిడెన్షియల్ ఏరియాలో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక సమర్పించిన నివేదికలో స్కూల్ యజమాన్యం పేర్కొంది. కానీ పారిశ్రామిక ప్రాంతంలో స్కూల్ ను ఏర్పాటు చేసింది. దీనికి తోడు సమీపంలోనే ఉన్న వెట్ ఇండియా ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ వెదజల్లే విష వాయువులు విద్యార్థుల పాలిట శాపంగా మారనున్నాయని వారన్నారు. ST.ANNE'S పేరుతో రాత్రికి రాత్రే అడ్మిషన్లు తెచ్చుకున్న స్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ఇద్దరు మంత్రులకు పదవీ గండం..?

హైదరాబాద్, : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయింది. ఏడాది పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం రేవంత్.. నిఘావర్గాలు, సునీల్ కనుగోలు టీమ్‌తో కలిసి సర్వే తెప్పించుకున్నారని తెలుస్తోంది. అయితే ఈ సర్వేలో సంచలన విషయాలు బయటకు వచ్చాయి. రేవంత్ కేబినేట్ లోని ఇద్దరు మంత్రులపై జనాలు తీవ్ర అసంతృప్తిలోఉన్నారని రిపోర్టులో వెల్లడైనట్లుగా తెలుస్తోంది. అయితే వారిని సీఎం స్వయంగా పిలిచి మాట్లాడుతారా లేకా కేబినేట్ నుంచి తొలిగిస్తారా అన్నది ఇప్పుడు మరింత హాట్ టాపిక్ గా మారింది. అంతేకాకుండా 20 మంది ఎమ్మెల్యేల పనితీరు బాలేదని రిపోర్టులో వెల్లడైనట్లుగా పొలిటికల్ సర్కిల్ లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇందులో కొత్తగా శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేలపైనే ఎక్కువగా ప్రజా వ్యతిరేకత ఉన్నట్లుగా సర్వేలో వెల్లడైందట. ఈ సర్వేలను త్వరలో ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో సీఎం రేవంత్ పంపించనున్నారట. దీంతో సర్వే నివేదికల్లో ఏముందన్న టెన్షన్ ఎమ్మెల్యేల్లో నెలకొంది. సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఇటీవల సీఎం ఇంటికి వెళ్లిన కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రేవంత్ క్లాస్ తీసుకున్నారు. కొత్తగా ఎన్నికైన కొంతమంది ఎమ్మెల్యేలు అత్యుత్సాహం చూపిస్తున్నారని, అతి చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వర్గ విభేదాలు పక్కన పెట్టాలని.. కార్యకర్తలకు సమయం ఇవ్వాలంటూ సూచించారు సీఎం. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే లందరి రిపోర్టులు తన దగ్గర ఉన్నాయని.. నేను మారాను మీరు కూడా మారండి అంటూ సీఎం వారికి చెప్పారు. ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం వారికి సూచించారు. నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళదామని పార్టీ నేతలతో సీఎం చెప్పుకొచ్చారు. ఇదిలాఉండగా.. సీఎం రేవంత్ బృందం జనవరి 21 నుంచి 23వ తేదీ వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించనున్నారు. దావోస్‌లో 20 నుంచి 24వ తేదీ వరకు అంటే ఐదు రోజుల పాటు 'ప్రపంచ ఆర్థిక వేదిక' వార్షిక సదస్సు జరగనుంది. ఈ సదస్సులో తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ బృందం ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లో బుర్జ్ ఖలీఫా తరహా టవర్: దుబాయ్ నగరంలో ప్రముఖ ఐకానిక్ సింబల్‌గా ఉన్న బుర్జ్ ఖలీఫా టవర్ లాంటిదాన్ని హైదరాబాద్ శివారులో ఉనికిలోకి రానున్న ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ)లోనూ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈనెల 13 నుంచి 24 వరకు ఆస్ట్రేలియా, సింగపూర్, దావోస్‌లలో పర్యటించనున్న ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ బృందం దీనికి సంబంధించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను పారిశ్రామికవేత్తలకు ప్రదర్శించి నిర్మాణం కోసం ముందుకు రావాల్సిందిగా కోరే అవకాశమున్నది.గతేడాది దావోస్ పర్యటన సందర్భంగా ఫోర్త్ సిటీ,ఫ్యూచర్ సిటీ కాన్సెప్ట్‌ను అక్కడి ఇన్వెస్టర్లకు పరిచయం చేశారు. దీనికి కొనసాగింపుగా నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక డిజైన్, ప్లానింగ్ గురించి ఈసారి పర్యటన సందర్భంగా వివరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సచివాలయ వర్గాల సమాచారం. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ ఉన్నందున ఫోర్త్‌సిటీకి అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధుల రాకపోకలకు వీలుగా ఉంటుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీనికి తోడు ప్లాన్డ్ సిటీగా తీర్చిదిద్దాలని భావిస్తున్నందున ఇండస్ట్రియల్, ఫార్మా, కమర్షియల్, టూరిజం క్లస్టర్లను ఫోర్త్ సిటీలో నెలకొల్పాలని ఆలోచిస్తున్నది. వేలాది ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం కానున్నది.ఫోర్త్ సిటీని రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ'గా భావిస్తున్నది. ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మూడు సిటీలుగా ఉండగా ఫ్యూచర్ సిటీ ఫోర్త్ సిటీగా అవతరించనున్నది. ఫోర్త్ సిటీకి సింబాలిక్‌గా బుర్జ్ ఖలీఫా టవర్ లాంటిదాన్ని ఈ సిటీ మధ్యలో నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నది.

# నంబరు ప్లేటు.. నచ్చినట్లు రాస్తే కుదరదు

**రాజమహేంద్రవరం,తెలంగాణ దిశ:** మీ వాహనానికి నంబరు ప్లేటు సరిగా లేకుంటే జరిమానా కట్టాల్సిందే. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీసు, రవాణా శాఖల అధికారులు స్పష్టం చేస్తున్నారు. పలువురు చోదకులు నంబరు ప్లేట్లను ఇష్టానుసారం రాయించుకుని వాహనాలు తిప్పేస్తున్నారు. కొందరు అసలు నంబరు ప్లేటు లేకుండా వాహనాలు తిప్పుతున్నారు. 2016 నుంచి షోరూంలలో వాహనాలను కొన్నవారు తప్పనిసరిగా ప్రభుత్వం అందజేస్తున్న హై సెక్యూరిటీ నంబరు ప్లేట్‌ను మాత్రమే బిగించుకోవాలన్న నిబంధన ఉన్నా చాలామంది అతిక్రమిస్తున్నారు. రవాణేతర వాహనాలకు నంబరు ప్లేటు తెలుపుగా ఉండి దానిపై నల్ల అక్షరాలు, అంకెలు ఉండాలి. ః రవాణా వాహనాలకు పసుపు నంబరు ప్లేటుపై నల్ల అక్షరాలు, అంకెలు ఉండాలి.

ః రిజిస్ట్రేషన్ జరిగే విద్యుత్తు వాహనాలకు ఆకుపచ్చ నంబరు ప్లేటు ఉండాలి. నంబరు ప్లేట్‌తో ఓ వాహనం చరిత్ర మొత్తం ఇట్టే తెలుసుకోవచ్చు. దీని ప్రాధాన్యతను గుర్తించి కేంద్ర మోటారు వెహికల్ చట్టంలో కొన్ని నిబంధనలను ఉంచారు. వాహనం కేటగిరీని బట్టి కచ్చితంగా హై సెక్యూరిటీ నంబరు ప్లేట్‌ను మాత్రమే బిగించుకోవాల్సి ఉంది. ప్లేటుపై నంబరులోని అంకెలు, అక్షరాలు మినహా ఏమీ ఉండకూడదు. చాలా వాహనాలకు




సినీనటులు, రాజకీయ నాయకులు చిత్రాలు ఉంటున్నాయి. అంకెలు, అక్షరాలను జిగ్ జాగ్‌గా రాస్తున్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం.. ఫ్యాన్సీ నంబర్లతో తిరుగుతుంటే రవాణేతర వాహనాలకు రూ.1,150, రవాణా వాహనాలకు రూ.1,300 అపరాధ రుసుం విధిస్తారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లచి పట్టుబడితే రూ.100 నుంచి రూ.150 వరకు చలానా రాస్తారు. ఇతర ఉల్లంఘనలుంటే అపరాధ రుసుములు మరింతపెరగడంతోపాటు కేసులు నమోదు వరకూ వెళ్తుంది.

# సిబ్బంది అరకొర..నేరాల కట్టడి ఎలా?




**వి.ఎల్.పురం,తెలంగాణ దిశ:** రైలు ప్రయాణికులకు భద్రత కల్పించడంతోపాటు నేరాలు నియంత్రించడంలో కీలకంగా వ్యవహరించే గవర్నమెంట్ రైల్వే పోలీసులు(జీఆర్పీ)లో సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. ఉన్న సిబ్బందిపై భారం పెరగడమేకాక అవసరానికి సెలవులు కూడా దొరకక కిందిస్థాయి సిబ్బంది సతమతమవుతున్నారు. స్టేషన్ల పరిధిలో పూర్తి పర్యవేక్షణతోపాటు పలు చోరీ కేసుల దర్యాప్తు త్వరితగతిన ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్ పరిధిలో ఇక్కడి ప్రధాన రైల్వేస్టేషన్‌తో కలిపి అయిదు స్టేషన్లున్నాయి. ఇటు గోదావరి రైల్వేస్టేషన్ నుంచి అటు ద్వారపూడి వరకు శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణ బాధ్యతలు ఇక్కడి జీఆర్పీ సిబ్బంది చూడాల్సి ఉంటుంది. ముఖ్యంగా రైళ్ల హాల్టు, ప్రయాణికులు రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రధాన రైల్వేస్టేషన్‌తోపాటు నగరం మధ్యలోని గోదావరి స్టేషన్‌లో మూడు షిఫ్టులుగా నిరంతర గస్తీ నిర్వర్తించాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగా ప్రధాన స్టేషన్‌లో షిఫ్టునకు ముగ్గురు, గోదావరి స్టేషన్ వద్ద ఇద్దరిని విధులకు కేటాయిస్తున్నారు. ఖాళీగా 22 పోస్టులు: ఇక్కడి జీఆర్పీ స్టేషన్‌లో మొత్తం 53 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 22 పోస్టులు కొంతకాలంగా ఖాళీగానే ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 30 వరకు ఇక్కడి జీఆర్పీ స్టేషన్‌లో మొత్తం 38 చోరీ కేసులు నమోదయ్యాయి. రైలు ప్రయాణికులకు సంబంధించి మొత్తం రూ.21.16 లక్షల సొత్తు చోరీకి గురైంది. ఇప్పటివరకు ఏడు కేసుల్లో రూ.4.39 లక్షలు మాత్రమే రికవరీ చేయగలిగారు. సిబ్బంది కొరత కారణంగా మరో 31 చోరీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయలేని పరిస్థితి. కొన్ని కీలక కేసుల్లో రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) సిబ్బంది సహకారం తీసుకుంటే తప్ప ఛేదించలేని పరిస్థితి. ప్రస్తుతం ఏఎస్సై, 21 మంది కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉండటం సమస్యగా మారింది. ఉన్న సిబ్బందే రైళ్లలో, ప్లాట్‌ఫామ్‌పై గస్తీ, ఎస్కార్ట్ విధులకే సరిపడక.. చోరీలు ఇతర నేరాలకు సంబంధించి కేసుల దర్యాప్తు సాగించలేని పరిస్థితి. పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం హయాంలోనే ప్రతిపాదనలు పంపినా ఫలితం లేక ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు.

# వసతుల్లేవు.. పర్యవేక్షణ లేదు

**నరసరావుపేట,తెలంగాణ దిశ:** నరసరావుపేట రామిరెడ్డిపేటలోని పోస్టుమెట్రిక్ వసతి గృహంలో సిగరెట్ పీకలు, మద్యం సీసాలు గుట్టలుగా మద్యం సీసాలు.. విచ్చలవిడిగా సిగరెట్ పీకలు.. తిరగని ఫ్యాన్‌లు.. పనిచేయని స్విచ్‌బోర్డులు.. అపరిశుభ్ర పరిసరాలు.. జిల్లాలోని పలు వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు ఇవి. ఇంటర్ డిగ్రీ చదివే విద్యార్థులుండే వసతి గృహాల్లో సౌకర్యాలు కొరవడ్డాయి. బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడ తారని గ్రామాల నుంచి పట్టణాలకు పంపించి ప్రభుత్వ వసతిగృహాల్లో చేర్పిస్తే అక్కడ ఉండే వాతావరణం చూసి విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. పలు వసతి గృహాల్లో విద్యార్థులు పక్కదారి పట్టేలా పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థుల భవిష్యత్తు అంధకా రమేనని విద్యావేత్తలు ఆవేదన చెందుతున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లోనే ఇలాంటి వాతావరణం కనిపిస్తోంది. జిల్లాలో పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఎస్సీ వసతి గృహాలనే తీసుకుంటే జిల్లాలో 11 వసతి గృహా లుండగా.. ఇందులో ఏడింట్లో రెగ్యులర్ వార్డెన్లు ఉండగా.. నాలుగు చోట్ల ఇన్‌ఛార్జిలతో నడిపిస్తున్నారు. 14 బీసీ వసతి గృహాల్లో ఒకచోట ఇన్‌ఛార్జి వార్డెన్ ఉన్నారు. గిరిజన వసతి గృహాల్లో మాత్రం మూడుచోట్లా రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. వసతి గృహాల్లో వార్డెన్లు లేక విద్యార్థుల ఇష్టా రాజ్యం అవుతోంది. అడిగేవారు లేకపోవడంతో రాత్రిళ్లు కొన్నిచోట్ల మద్యం సీసాలను నేరుగా వసతిగృహాలకే తీసుకొస్తున్నారు. కొందరు ధూమపానం కూడా చేస్తున్నట్లు సమాచారం. కళాశాల విద్య కోసం గ్రామాల నుంచి పట్టణాలకు రావడం.. కొత్త స్నేహాలు.. బిర్యానీ.. మందు.. సిగరెట్.. వంటి అలవాట్లతో విద్యార్థులు



పక్కదారి పడుతున్నారు. ఇలాంటి అలవా ట్లకు వసతిగృహాలు నిలయాలుగా మారడం బాధాకరం. నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, మాచర్ల, చిలకలూరిపేట వంటి పట్టణాల్లో ఉండే పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. కొన్నింటికి సొంతభవనాలు లేవు. అద్దె భవనాల్లో నడిపిస్తున్నారు. ఫ్యాన్లు తిరగవు. కొన్నిచోట్ల అయితే ఫ్యాన్లను ధ్వంసం చేస్తున్నారు. స్విచ్‌బోర్డు ఊడిపోయి.. విద్యుత్తు తీగలు వేలాడుతూ భయంకరంగా ఉన్నాయి. కిటికీలు, తలుపులు ఊడిపోయాయి. మరుగుదొడ్ల సంగతి సరేసరి. ఆహారం కూడా నాణ్యత ఉండడం లేదని పలువురు చెబుతున్నారు. జిల్లా కేంద్రం రామిరెడ్డిపేటలో ఉండే వసతిగృహం పరిస్థితి తీసికట్టుగా ఉంది. ఎక్కడి కక్కడ చెత్త.. మద్యం సీసాలు, సిగరెట్ పీకలు కనిపిస్తున్నాయి. వసతి గృహంలోకి అడుగుపెట్టగానే దుర్వాసన వస్తోంది.ఇలా ఉండబట్టే విద్యార్థులసంఖ్య కూడా ఆయా వసతిగృహాల్లో రానురాను తగ్గిపోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సందర్శించి గాడినపెట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# విద్యుత్తు పరికరాల అంచనా వ్యయాలు ఏపీలో ఎక్కువ




**కర్నూలు,తెలంగాణ దిశ:** దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్తు పరికరాల అంచనా వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అదుపు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఛైర్మన్ జస్టిస్ సి.నాగార్జునరెడ్డి అన్నారు. కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో నిర్వహించిన 'రాష్ట్ర విద్యుత్తు సమన్వయ ఫోరం' సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. రాష్ట్రంలోని విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వ 'సమీకృత స్వచ్ఛ ఇంధన విధానం'లోని ముఖ్య అంశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అన్నిరకాల విద్యుత్తు వినియోగదారులకు ఉపయుక్తంగా ఉండేలా 2024-25నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరం వరకు ఐదేళ్లపా టు అమలులో ఉండే రాష్ట్ర విద్యుత్తు ప్రణాళికను తీర్చిదిద్దినట్లు గుర్తుచేశారు. సమీకృత స్వచ్ఛ ఇంధన విధానానికి అనుగుణంగా ఆ రాష్ట్ర ప్రణాళికను అవసరం మేరకు పునఃసమీక్ష చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని విద్యుత్తు సంస్థలు ఏటా డిసెంబరు నెలాఖరుకల్లా.. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరానికి అమలుచేసే 'కాస్ట్‌డేటా'కు ఏపీఈఆర్సీ అనుమతి తీసుకోవా ఎలని గుర్తుచేశారు. ప్రతి విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్తు నియంత్రణ మండలి తరఫున ఒక ప్రత్యేకాధికారిని నియమించామని తెలిపారు. వారు సంస్థ పరిధిలోని లైన్లు, సూచనలు చేస్తారని.. వాటిని కమిషన్ ఆదేశాలుగా పరిగణించి పంపిణీ సంస్థలు అమలుచేయాలని పేర్కొన్నారు. వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడమే లక్ష్యంగా విద్యుత్తు పంపిణీ సంస్థ పనిచేయాలని చెప్పారు.

రాష్ట్ర విద్యుత్తు ప్రణాళిక ఉద్దేశాలు, లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్సీ సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, వెంకటరామరెడ్డి, పంపిణీ సంస్థల సీఎండీలు పి.రవి, సంతోష్‌రావు, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, ఎన్టీపీసీ, సెకి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిరస్థాయిగా నిలిచేలా తాండవ ఎత్తిపోతల: అయ్యన్న

**నాతవరం,తెలంగాణ దిశ:**'యాభై ఏళ్ల రాజకీయ జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయే లా తాండవ ఎత్తిపోతల పథకాన్ని సాధించి ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తా'నని సభాపతి అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గొలుగొండపేట నుంచి వెదురుపల్లి వరకు రోడ్డు నిర్మాణానికిశంకుస్థాపన చేశారు. ఎత్తిపోతలకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేసినట్లు చెప్పారు. గబ్బాడ యార్డులో అక్రమంగా ఇసుక నిల్వ చేసిన సంస్థకు రూ. 20 కోట్ల జరిమానా విధించేలా చేశానన్నారు. గబ్బాడ యార్డులో అక్రమంగా ఇసుక నిల్వ చేసిన సంస్థకు రూ. 20 కోట్ల జరిమానా విధించేలా చేశానన్నారు. ఈ ఇసుకను రవాణా ఛార్జీలు చెల్లించి ఎవరైనా తీసుకువెళ్లవచ్చుని ఈ ఇసుకను రవాణా ఛార్జీలు చెల్లించి ఎవరైనా తీసుకువెళ్లవచ్చుని సూచించారు. నాతవరం మండలం లో రహదారుల అభివృద్ధిని వైకాపా




ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. వెదురుపల్లి, మన్యపురట్ల, కాకరాపల్లి రహదారుల నిర్మాణానికి రూ. 3 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. నాయకుల మధ్య కుమ్ములాటలు సరికాదని, పనిచేసే వారికే పదవులని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తెదేపా సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని సూచించారు.

# పెచ్చుమీరిన యూసీడీ సిబ్బంది ఆగడాలు!

**విశాఖ,తెలంగాణ దిశ:** మహా విశాఖ నగరపాలక సంస్థ యూసీడీ (పట్టణ సామాజికా భివృద్ధి) సిబ్బంది ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. మెప్మా నుంచి వచ్చి జీవీఎంసీలో డీసీఎంగా (డిస్ట్రిక్ట్ మిషన్ కో-ఆర్డినేటర్) విధులు నిర్వహించిన అధికారి మహిళా సంఘాల నుంచి రూ.కోట్లు తీసుకున్నట్లు ఇటీవల తెదేపా కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధారాలను బయటపెట్టడంతో కమిషనర్ ఆయన్ను సస్పెండ్ చేశారు. డీసీఎం వ్యవహారంతోపాటు, యూసీడీ సిబ్బంది అక్రమాలపై అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మను విచారణాధికారిగా నియమించారు. త్వరలో ఆయన విచారణ ప్రారంభించనున్నారు. ఆరోప ణలు ఎదుర్కొంటున్న డీసీఎంకు సహకరించిన ఇద్దరు ఆర్పీలను కమిషనర్ సస్పెండ్ చేశారు. అయితే తమను ఎవరూ సస్పెండ్ చేయలేదని మహిళా సంఘాల ప్రతినిధులకు చెబుతూ క్షేత్రస్థాయిలో యూసీడీ వ్యవహారాలన్నీ వారే నడిపిస్తుండడం గమనార్హం. సోమవారం 98వ వార్డుకు చెందిన 70 మంది డ్వాక్రా మహిళలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిశారు. ఆర్పీ లక్ష్మీ ప్రసన్న వేధింపులు భరించలేకపోతున్నామని, ప్రతి విషయానికి డబ్బులు



డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఫిర్యాదు చేశారు. అధికారులు ఆమెను సస్పెండ్ చేశామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తోందని తెలిపారు. పలువురు యూసీడీ అధికారులు ఆమెకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తన వద్ద ఉంచుకుని వడ్డీలు చెల్లిస్తానని చెబుతోందని, ప్రభుత్వ నిధులు, రాయితీలు అందకుండా చేస్తోందని వాపోయారు.

# సంక్షోభ హాస్టళ్లు!-పెచ్చులూడుతున్న పైకప్పులు



**తిరుపతి,తెలంగాణ దిశ:** ఏర్పేడు బీసీ బాలుర హాస్టల్లో పిల్లలకు కనీస సదుపాయాలు లేవు. బెడ్‌షీట్లు సరఫరా కాకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకుని వాడుకుం టున్నారు. దుస్తులు కూడా ఇంతవరకూ పంపిణీ కాలేదు. వర్షానికి రెండు గదులు ఉరుస్తున్నాయి. గదుల పైకప్పు కాంక్రీటు పెచ్చులూడిపోయి ఇనుప కమ్మీలు కనిపిస్తున్నాయి. పైపులైను పాడవడంతో రెండు వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. సిమెంట్ తొట్టిలో నీరు నింపి వాటిని వాడుకుంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. దీంతో పగలు పశువులు, రాత్రిళ్లు పాములు ఆవరణలోకి వస్తున్నాయి. వార్డెన్ పోస్టు ఖాళీగా ఉండటంతో రేణిగుంట వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బీఎన్ కండ్రిగ ఎస్సీ బాలుర హాస్టల్ భవనం కట్టి 30 ఏళ్ళవుతోంది. గోడలు కూడా బీటలు వారాయి. కిటికీల తలుపులు పగిలిపోయాయి. బీసీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్మాణం ఆరేళ్ళగా అసంపూర్తిగానే వుంది. సత్యవేడు బీసీ బాలుర హాస్టల్ గదుల పైకప్పు దెబ్బతింది. కాంక్రీటు పెచ్చులూడిపోయి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. గదులన్నీ వర్షానికి ఉరుస్తున్నాయి. గోడలు నానిపోయి చెమ్మ తేలి ఉన్నాయి. కిటికీల తలుపులు పుచ్చిపోయాయి. సత్యవేడులోనే ఎస్సీ బాలుర హాస్టల్ పైకప్పు కూలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. వంట గది చూస్తే అన్నం తినబుద్ది కాదు. వాచ్‌మెన్ పోస్టు ఖాళీ. వంట మనిషే అన్ని పను లూ చేస్తున్నారు. పిచ్చాటూరు ఎస్సీ బాలుర హాస్టల్ భవనం ప్రమాదకర స్థితిలో ఉంది. పైకప్పు మొత్తం దెబ్బతిని ఏ క్షణానైనా కూలిపోయేలా వుంది. ప్రహరీ లేకపోవడంతో హాస్టల్ చుట్టూ వర్షానికి నీరు చేరుతోంది. దక్కిలి బీసీ బాలుర హాస్టల్‌లో గదులన్నీ అధ్వాన్నంగా వున్నాయి. కిటికీలకు తలుపులు పూర్తిగా ఊడిపోవడంతో గోతాములు కట్టి మూసేశారు. వర్షానికి గదులు ఉరుస్తున్నాయని విద్యార్థులు చెప్పారు. బాత్‌రూమ్ దుర్వాసన వెదజల్లుతోంది. నాయుడుపేట బీసీ సంక్షేమ కళాశాల వసతి గృహం అద్దె భవనంలో నడుస్తోంది. భవన నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ఫ్లోరింగ్ పూర్తి కాలేదు. గోడలకు ప్లాస్టరింగ్ జరగలేదు. కిటికీలు, తలుపులు కూడా ఏర్పాటు కాలేదు.

# నిబంధనలు గాలికి..!-ప్రజల ప్రాణాలతో చెలగాటం..?


**తిరుపతి,తెలంగాణ దిశ:** తిరుపతికి చెందిన ఓ యువతి గర్భం దాల్చింది. దాన్ని పోగొట్టుకునేందుకు మందుల కోసం తిరుపతిలోని ప్రైవేటు దుకాణాన్ని ఆశ్రయించింది. డాక్టరు చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదని, అలా ఇవ్వాలంటే అదనంగా నగదు చెల్లించాల్సి వస్తుందని దుకాణదారుడు చెప్పాడు. గత్యంతరం లేక ఎమ్మార్పీ కంటే రెండింతల ధర పెట్టి మందులు కొనుగోలు చేసింది. వాటిని ఇష్టానుసారం వాడటం వల్ల తీవ్ర రక్తస్రావమై ప్రాణం మీదకు తెచ్చుకుని ఆస్పత్రి పాలైంది. శ్రీకాళహస్తికి చెందిన సురేష్ తన ఐదేళ్ల కుమారుడు దగ్గు, జలుబుతో బాధపడుతుండటంతో పట్టణంలోని ఓ మందుల దుకాణానికి వెళ్లి విషయం చెప్పాడు. దుకాణ యజమాని మందులు ఇచ్చి, మూడు రోజులు వాడమని చెప్పాడు. ఆ మందులు వాడినా ఎలాంటి ఉపయోగమూ లేకపోగా బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించింది. చివరకు డాక్టరు దగ్గరకు వెళ్లారు. బాలుడిని రెండు రోజులు ఆస్పత్రిలో ఉంచి రూ.10 వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చింది. జిల్లాలో ఇటువంటి ఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నా సంబంధిత వైద్యాధికారులు కట్టడి చేసే దిశగా చర్యలు చేపట్టడం లేదు. జిల్లావ్యాప్తంగా 2,700 లైసెన్సు కలిగిన మందుల దుకాణాలు ఉంటే అందులో తిరుపతిలో 600లకు పైగా ఉన్నాయి. లైసెన్సు లేకుండా 500కు పైగా కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో సగటున రోజుకు రూ.6 నుంచి 8 కోట్ల వ్యాపారం జరుగుతోంది. అర్హత లేకనే మందుల (ఔషధ) దుకాణాలు పెట్టేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యుల సిఫారసు లేకుండా ఇస్తున్న మందులతో రోగుల ప్రాణాల మీదకు వస్తోంది. మందుల దుకాణం ప్రారంభించాలంటే ముందుగా ఔషధ నియంత్రణ అధికారుల అనుమతి తీసుకోవాలి. దుకాణంలో డీఫార్మసీ పూర్తి చేసిన ఫార్మాసిస్టు తప్పక అందుబాటులో ఉండాలి. అనుమతి వారి పేరుతోనే ఉండాలి.



మందుల విక్రయాలు పూర్తిగా డాక్టరు చీటి ఉంటేనే విక్రయించాలి. కొనుగోలు చేసిన, విక్రయించిన మందుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి. ఇరకు గదుల్లోనూ దుకాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. జిల్లాలో ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు ఒకరు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు ఉన్నారు. వీరు మందుల దుకాణం ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో కొలతలు, నిబంధనలు పరిశీలించాలి. నెలలో ఒకసారైనా దుకాణాలను తనిఖీ చేయాలి. ఆ దిశగా ఎక్కడా కనిపించడం లేదు. ముడుపులు అందుతుండడం వల్లే అటువైపు చూడడం లేదన్న విమర్శలున్నాయి. దుకాణాలు పక్క ప్రాంతాల్లోకి మార్చుకోవాలన్నా లేదా ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలన్నా అదనంగా ముడుపులు చెల్లించాల్సి వస్తోందని విక్రయదారులు వాపోతున్నారు. ఇదే వ్యవహారంలో ఇటీవల గూడూరులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి చిక్కారు.

# ఆగని ఇసుక అక్రమాలు-అడ్డుకున్న గ్రామస్తులు

**చౌడేపల్లె,తెలంగాణ దిశ:** వైసీపీ ప్రభుత్వం మారినా ఇసుక అక్రమాలు ఆగడం లేదు. తాజాగా ఇసుక అక్రమ తవ్వకాలను లద్దిగం గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన ఆదివారం చౌడేపల్లె మండలంలో జరిగింది. చౌడేపల్లె, పుంగనూరు మండ లాల్లో అతిపెద్ద చెరువుల్లో లద్దిగం చెరువు కూడా ఒకటి. మొత్తం 750 ఎకరా (చౌడేపల్లె మండలంలో 500, పుంగనూరు మండలంలో 250 ఎకరా)ల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు ఆయకట్టు కింద లద్దిగం, బండ్లపల్లె, కొత్తపల్లె, తిర్ణింపల్లె, మలసముద్రం, అంకుతోటపల్లె, పుదిపట్ల గ్రామాలకుచెందిన సుమారు వెయ్యి ఎకరాలపైనే ఆయకట్టు భూములను రైతులు సాగు చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను కొన్నేళ్లుగా ఈ చెరువులో తవ్వేసి.. తరలించి.. కోట్లు గడించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా టీడీపీ నాయకుల అండతో నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు వైసీపీ నాయకులు ఇసుక అక్రమ తవ్వకాలు ఆపలేదు. గత ప్రభుత్వంలో నోరు తెరవడానికి కూడా భయపడిన మేము.. ప్రస్తుతం ధైర్యం చేసి, తవ్వకాలను అడ్డుకున్నాం. మమ్మల్ని చూసి అక్కడ పనిచేస్తున్న వారు యంత్రాలను వదిలి వెళ్లిపోయారు. చెరువులో సుమారు 40 నుంచి 50 అడుగుల లోతు వరకు మ ట్టిని తవ్వేసి.. ఇసుక తీసేస్తున్నారు. నదిని తలపించేలా తవ్వేయడం వల్ల చెరువు రూపు కోల్పోవటంతోపాటు, భూగర్భ జలాలూ అడుగంటిపోతున్నాయి. దీనిపై గతంలో, ప్రస్తుతం ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. జిల్లాలో గుర్తించిన ఇసుక పాయింట్లలో యంత్రాలతో తవ్వుతున్నట్లు తెలిసినా, అక్రమంగా తరలిస్తున్నా.. పార్టీలకు అతీతంగా కేసులు నమోదు చేస్తున్నారు. జీడీనెల్లూరు మండలంలో ఇటీవల యంత్రాలతో ఇసుకను తమిళనాడుకు తరలిస్తున్నారని తెలుసుకున్న అధికారులు దాడులు చేసి.. మిషనరీని సీజ్ చేశారు. మా చెరువును రక్షించుకోవాలన్న ఉద్దేశంతో తవ్వకాలను అడ్డుకున్నాం. కలెక్టర్ స్పందించి తవ్వకాలు జరగకుండా చేసి, చెరువును బాగు చేయించాలి. తహసీల్దార్ హనుమంతును వివరణ కోరగా.. చెరువులో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు తెలియగానే తమ సిబ్బందితో వెళ్లి అక్కడున్న ఐదు ఎక్స్‌కవేటర్లు, ఓ టిప్పర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో తమ సిబ్బంది అక్కడికి వెళ్లి పనులను ఆపించామన్నారు. అలాగే తహసీల్దార్ ఆదేశాలతో పనులు జరగకుండా తమ సిబ్బందిని అక్కడే బందోబస్తు పెట్టినట్లు వివరించారు.



# చెత్త సేకరణలో ఆదాయ మార్గాలు

**కరీంనగర్,తెలంగాణ దిశ:** నివాసిత ఇళ్ల నుంచి గత కొన్నేళ్లుగా చెత్త సేకరణకు నెలవారీ రుసుము వసూలు చేస్తుండగా.. అదే తరహాలో వాణిజ్య సంస్థలు, దుకాణాల నుంచి చెత్త సేకరణను పూర్తిగా ప్రైవేటుకు అప్పగించాలని నిర్ణయించారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ మాదిరిగా ప్రధాన, అంతర్గత రహదారులలో ఉన్న దుకాణాల నుంచి చెత్త తీసుకెళ్లడానికి ప్రైవేటు ఏజెన్సీకి టెండర్ ద్వారా అప్పగించేందుకు కసరత్తు చేస్తున్నారు. నగర పాలికకు ఆదాయం పెరగడంతోపాటు బల్దియాపై భారం తప్పనుంది. ఈ మేరకు ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. త్వరలోనే టెండర్ నిర్వహించి ఆదాయం పెంచుకుంటామని నగర మేయర్ వై.సునీల్‌రావు తెలిపారు. నగరంలోని దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ఆసుపత్రులు, కల్యాణ మండపాలు, హొటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, మెస్‌లు, కిరాణ దుకాణాలు, గెస్ట్ హౌస్ తదితర వాణిజ్య సంస్థల ద్వారా వచ్చే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు టెండర్ నిర్వహించనున్నారు. వీటి కోసం ప్రస్తుతం నాలుగు ట్రాక్టర్లు, 16 మంది కార్మికులు పని చేస్తుండగా ఏడాదికి రూ.30 లక్షలు ఖర్చు అవుతుంది. ఆ మొత్తాన్ని యూజర్ ఛార్జీల చొప్పున వసూలు చేస్తున్నారు. పైగా ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇళ్ల తరహాలోనే వీటికి ప్రైవేటుగా అప్పగించేలా వివరాలు సేకరించారు. రూ.40 లక్షలకు తగ్గకుండా ఆదాయం వచ్చేలా కార్యాచరణ తీసుకుంటున్నారు. నగరపాలికకు సైతం కార్మికులు,




నాలుగు ట్రాక్టర్లు ఇతర డివిజన్ అవసరాలకు వినియోగించుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. ప్రతి దుకాణం నుంచి, సంస్థ నుంచి ప్రైవేటుగా చెత్త సేకరించనున్నారు. ప్రస్తుతం రాత్రి, ఉదయం చెత్తంతా రోడ్ల మీద పడేస్తున్నారు. పారిశుద్ధ్య పనులకు విఘాతం కలుగుతుంది. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా చెత్తను సేకరించి యూజర్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. చెత్త వేసినా, వేయకపోయినా ప్రతి దుకాణం నుంచి నిర్ణీత మొత్తాన్ని వసూలు చేస్తారు. రోడ్డుపై చెత్త వేయడం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. స్వచ్ఛ ఆటోలు కేవలం నివాసిత ఇళ్ల నుంచే చెత్తను క్రమం తప్పకుండా తీసుకెళ్లే అవకాశాలుంటాయి. ప్రస్తుతం కొన్ని డివిజన్లలో వాణిజ్య సంస్థలకే ప్రాధాన్యం ఇస్తూ ఇళ్ల నుంచి చెత్తను తీసుకెళ్లేందుకు మొండికేస్తున్నారు.

# కబ్జాదారుల ఆగడాలకు ముకుతాడు

**పెద్దపల్లి ,తెలంగాణ దిశ:** ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. రూ.కోట్ల విలువైన భూములు హారతికర్పూరంలా కరిగిపోతున్నాయి. చెరువు శిఖం భూములు కనుమరుగవుతున్నాయి. ఆయా అంశాలపై కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టి సారించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల, గనుల శాఖలను భాగస్వామ్యం చేశారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించారు. ఎక్కడ అడుగు స్థలం కబ్జాకు గురయినా అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోనున్నారు.జిల్లాలో ఇప్పటి వరకు భూముల కబ్జాపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. ఇక నుంచి ఎక్కడ చిన్న కబ్జా జరిగినా అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సత్వరం విచారణ చేపడతారు.శిథిలమైన ప్రభుత్వ భవనాలు, భూసేకరణ చేసిన భూములు, ప్రభుత్వ స్థలాల్లో అంగుళం



కబ్జాకాకుండా నిరంతరం పర్యవేక్షించనున్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో హద్దులు నిర్ణయిస్తారు.గత కొన్నాళ్లుగా చెరువులు, కుంటల శిఖం భూములు రీసర్వేకు నోచుకోవడంలేదు. ఆయకట్టు రైతులు మొరపెట్టుకున్నా. .అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.

# అక్కరకు రాని అభివృద్ధి పనులు



**గోదావరిఖని,తెలంగాణ దిశ:** అధికారులు, పాలకుల అనాలోచిత అభివృద్ధి పనులతో రామగుండం ప్రజలకు పాట్లు తప్పడం లేదు. అవసరమైన చోట పనులు చేపట్టకుండా.. అవసరం లేనిచోట చేపట్టడంతో ప్రజాధనం వృథా అవుతుంది. రామగుండం నగరపాలికలో గత రెండు దశాబ్దాల్లో ఇలా రూ.కోట్ల పనులు జరిగాయి. ఈ ప్రాంతాభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తే వాటిని సక్రమంగా వినియోగించి ప్రజలకు సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు స్థానిక అవసరాలను గుర్తించకుండా నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పూర్తి చేసిన నిర్మాణాలను వినియోగంలోకి తేవడంలో వారు నిర్లక్ష్యం చూపుతున్నారు. పలు నగరపాలిక భవనాలు వినియోగానికి నోచుకోకుండానే శిథిలమౌతున్నాయి. సుమారు ఏడేళ్ల క్రితం నగరపాలక కూరగాయల మార్కెట్పైన రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.1.1 కోట్లతో రేకుల షెడ్లు నిర్మించారు. కూరగాయల వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. శిథిల కూరగాయల మార్కెట్ భవనానికి అవసరమైన మరమ్మతులు చేసి వ్యాపారాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలనే వినతులను ఏమాత్రం పట్టించుకోని పాలకవర్గం పై అంతస్తులో నిర్మాణాలు చేపట్టింది. ఇదేమంటే నగరంలో రోడ్లపైన అమ్మకాలు చేపట్టే చిరు వ్యాపారులను మార్కెట్ పైఅంతస్తులోకి తరలిస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. కింది అంతస్తులోనే వ్యాపారాలు లేక ఇబ్బంది పడుతుండగా పై అంతస్తులోకి వెళ్లి కొనుగోలు చేసే పరిస్థితుల్లేవు. నగరపాలిక ప్రాంతంలోనే అతి పెద్ద వారాంతపు సంత గోదావరిఖనిలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులు రూ.4 కోట్లతో నగరంలోని వారాంతపు సంతల్లో షెడ్లు నిర్మించారు. ఇందులో నగరంలోని వారాంతపు సంతల్లో దాదాపుగా సరిపోయే రీతిలో షెడ్లు నిర్మాణం చేపట్టగా గోదావరిఖనిలో మాత్రం అయిదో వంతు గద్దెలపైన మాత్రమే షెడ్లు వేశారు.

మిగతా గద్దెలపై వ్యాపారాలు చేసుకునే వారు ఎండ, వానలకు గొడుగులను రక్షణగా పెట్టుకుంటున్నారు. గోదావరిఖనిలోని కూరగాయల మార్కెట్ భవనంపై అంతస్తులో నిర్మించిన షెడ్లను వారాంతపు సంతలో నిర్మించి ఉంటే వ్యాపారులు,ప్రజల ఇక్కట్లు తప్పడంతో పాటు నిధులు సద్వినియోగమైన ట్లుగా ఉండేది. ఇప్పుడేమో మార్కెట్ పై అంతస్తులో నిర్మాణాలు నిరుపయోగమై నిధులు వృథా కాగా వారాంతపు సంతలో పాట్లు తప్పడం లేదు. నిరుపయోగ నిర్మాణాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం. నిధుల లభ్యత ప్రకారంగా అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా మంత్రి, ఎమ్మెల్యే చొరవతో రామగుండం అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేస్తున్నారు. త్వరలోనే అభివృద్ధిలో రామగుండం ఆదర్శంగా నిలవనుంది.

# కాలుష్యం చెర.. వీడేదెన్నడు?

**జగిత్యాల,తెలంగాణ దిశ:** నీటి వనరులు, భూగర్భ జలాలను మురుగు నీరు కలుషితం చేస్తోంది. మురుగునీటిని శుద్ధి చేయడం, రీసైకిల్ చేసిన జలాన్ని సమీపంలోని నీటి వనరుల్లోకి వదిలే దిశగా స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 పథకం కింద రాష్ట్రంలోని అన్ని పురపాలికల పరిధిలో సీవరేజ్ ట్రీట్మెంటు ప్లాంటు(ఎస్‌టీపీ)లు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఎస్‌టీపీల నిర్మాణం కోసం తమవంతు వాటాగా 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం కింద నిధులు కేటాయించేలా పథకానికి రూపకల్పన చేసింది. ఉమ్మడి జిల్లాలో సిరిసిల్లలో అప్పటికే పనులు ప్రారంభం కాగా మిగతా 13 మున్సిపాలిటీల పరిధిలో ఎస్‌టీపీలు ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో అంచనాలు రూపొందించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి రెండేళ్లు దాటుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. పరిపాలన అనుమతులు, రాష్ట్ర వాటా కింద నిధులు కేటాయింపులో జాప్యం ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఎస్‌టీపీల ఏర్పాటు కోసం పట్టణ జనాభా ఆధారంగా రోజుకు సగటున వినియోగించిన నీటిని లెక్కిస్తారు. ఒక వ్యక్తి రోజుకు సగటున 135 లీటర్ల నీరు వినియోగిస్తారని అంచనా. వినియోగించిన నీరు కాలువల్లో ప్రవహిస్తూ శివారు ప్రాంతాలకు చేరేలోపు ఇంకిపోవడం, ఆవిరి అవుతుంటుంది. ఇదంతా 30 శాతం వరకు ఉంటుండగా, తక్కిన మురుగునీటి అంచనాకు అనుగుణంగా ఎంత సామర్థ్యంతో ఎస్‌టీపీ నిర్మించాలనేది ఖరారు చేస్తారు. ఇందుకోసం పట్టణంలో కాలువల ద్వారా మురుగునీరు ప్రవహిస్తున్న ప్రాంతాలను గుర్తిస్తారు. ఎస్‌టీపీ నిర్మించేందుకు, సామర్థ్యానికి అనుగుణంగా 2 నుంచి 3 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరిస్తారు. కాలువల ద్వారా వచ్చిన మురుగునీటిని ఎస్‌టీపీలోకి తరలించేందుకు వీలుగా అనుసంధాన( ఇంటర్‌సెప్షన్) పైపులైన్ నిర్మిస్తారు. పైపులైన్ ద్వారా తరలించిన మురుగునీటిని ఎస్‌టీపీలో శుద్ధి చేస్తారు. అనంతరం శుద్ధ జలాన్ని సమీపంలోని నీటి వనరుల్లోకి వదులుతారు. మురుగునీరు కారణంగా కాలుష్యమవుతన్న నదులపై జాతీయ స్థాయిలో చర్యలకు ఉపక్రమించిన జాతీయ హరిత ప్రత్యేక న్యాయస్థానం(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్), రెండో ప్రాథమ్యంగా రాష్ట్రాల్లోని మున్సిపాలిటీలపై దృష్టిసారించింది. ఈ క్రమంలో సత్వరం సక్రమమైన చర్యలు తీసుకోకుంటే



భారీ జరిమానా విధిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఎస్‌బీఆర్( సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్) సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్‌టీపీలు నిర్మించేందుకు సన్నాహాలు చేసింది. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టులు సైతం సిద్ధం చేశారు. ప్రజారోగ్యశాఖ పర్యవేక్షణలో చేపట్టే ఎస్‌టీపీల నిర్మాణాలు రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం గతేడాదే ఆమోదం తెలిపినప్పటికీ పరిపాలన అనుమతులు, నిధుల కేటాయింపులో జాప్యం కారణంగా నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలోని మున్సిపా లిటీల్లో ఎస్‌టీపీలు ఏర్పాటు చేసేందుకు రూ.145 కోట్లు అవసర మని అంచనాలు రూపొందించగా, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.69 కోట్లు, రూ.77 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఇవి కాకుండా బల్దియాల పరిధిలో కాలువలు సక్రమంగా లేకపోవడం, రహదారులు వెడల్పుగా లేని ప్రాంతాల్లో భూగర్భ కాలువలు నిర్మించి ఎస్‌టీపీలకు అనుసంధానిం చాలని ప్రజాప్రతినిధుల నుంచి వినతులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 201 కి.మీ మేర భూగర్భ కాలువలు నిర్మిం చాల్సి ఉంటుందని నిర్ధారించారు. వీటికి ఒక్కో కి.మీ కనీసం రూ.70 లక్షల చొప్పున రూ.141 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు అంచనాకు వచ్చారు. వీటికి కేంద్ర ప్రభుత్వం వాటా విషయంలో స్పష్టత లేదు.

# గ్రీన్‌సిటీలో పెచ్చుమీరిపోతున్న అక్రమాలు



మంచిర్యాల:మున్సిపాలిటీకి అప్పగించిన రోడ్లను సైతం ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తున్నారు. కార్మెల్ స్కూల్ నుంచి గ్రీన్‌సిటీకి వెళ్లే ట్కప్లై ఓవర్ గోడ పక్కనే రోడ్డు ఉంది. ఆరోడ్డు పక్కనే ఉన్న కొద్ది పాటి స్థలం(ఈ స్థలం లే-అవుట్ చేసినప్పుడు రోడ్డు కింద మున్సిపాలిటీకి అప్పగించారు)లో రెండు రూమ్‌లు నిర్మించేందుకు ఓవ్యక్తి సిద్ధమయ్యాడు. గ్రీన్‌సిటీలో బట్టలు ఇస్త్రీ చేస్తూ, ఇండ్లలో పాచి పనులు చేసే వ్యక్తి కుటుంబానికి ట్కప్లై ఓవర్ గోడ పక్కన ఉన్న ల్యాండ్‌ను గ్రీన్‌సిటీలో ఉండే ఓ పెద్ద మనిషి విక్రయిం చినట్లు తెలిసింది. సదరు వ్యక్తి తన ఊరిలో ఉన్న కొద్దిపాటి స్థిరాస్తులు విక్రయించి రూ.4 లక్షలు ఇచ్చికొన్నట్లు సమాచారం.

ఆ స్థలంలో ముందు చిన్న టేలా పెట్టుకున్నాడు. ఆపై అదే స్థలం(మున్సిపాలిటీ)లో శనివారం ఉదయం రూమ్‌లు కడుతున్నారనే సమాచారమందుకున్న 'నమస్తే తెలంగాణ' అక్కడకి వెళ్లి ఫొటోలు తీసింది. అదే సమయంలో అక్కడికి టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం వచ్చారు.

విషయం తెలుసుకున్న పెద్ద మనిషి తనపైకి ఎక్కడ వస్తుందోనని సాయంత్రం నిర్మించిన పునాది నుంచి రాళ్లు తీసి రాళ్లవాగు ప్రహరీ పక్కన పెట్టేశారు. దీంతో ఆ బరువు తట్టుకోలేక రాళ్ల వాగు ప్రహరీ 30 మీటర్ల నుంచి 35 మీటర్ల వరకు కూలిపోయి.. వాగులో పడిపోయింది.

దీంతో కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించే మార్గంలో ఇలా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అత్యాశకుపోయి రాళ్లవాగు ప్రహరీ కూలేందుకు కారణమైన వ్యక్తులపై మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటారా.. లేదా అనేది వేచి చూడాలి.

ఉదయం ఈ అక్రమ కట్టడాన్ని పరిశీలించిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలుసుకుందామని 'నమస్తే తెలంగాణ' వారిని సంప్రదించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు..

# అసంపూర్తి పనులు..
# మౌలిక వసతుల కరవు..?

**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** సుల్తానాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి కింద రూ.20 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు నిర్మాణం గోడలకే పరిమితమైంది. పెద్దపల్లి పట్టణం మచిలిఖేడ ప్రాథమిక ఉర్దూ పాఠశాల ముందు మురుగు నీటి దుర్వాసన విద్యార్థులను అనారోగ్యానికి గురి చేస్తోంది. ఇక్కడ 24 మంది విద్యార్థులుండగా అమ్మ ఆదర్శ కమిటీలో వంటశాల, మూత్రశాలల నిర్మాణం గోడలకే పరిమితమైంది. పట్టణంలోని మురుగు నీరు ఈ కాలువ నుంచే ప్రవహిస్తోంది. ఓదెల మండలం హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. శ్మశాన వాటిక సమీపంలో బడి ఉండటం శవాలను కాల్చివేసే సమయంలో గదుల్లోకి పొగ వస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. రెండేళ్లుగా 'మన ఊరు-మన బడి' పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. జిల్లాలో 539 పాఠశాలల్లో 26,215 మంది విద్యార్థులు చదువుతున్నారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి, ఆట స్థలాలు అందుబాటులో లేవు. బడుల్లో ప్రహరీ లేకపోవడంతో పందులు, పశువులు సంచరిస్తున్నాయి. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వేసవిసెలవుల



తర్వాత నేడు పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం మన ఊరు-మన బడి కింద 191 పాఠశాలల్లో రూ.కోట్ల నిధులతో హడావుడిగా పనులు ప్రారంభించినా పావలా వంతు ప్రగతి పూర్తికాలేదు. మండలానికి రెండు ఆదర్శ పాఠశాలల్లో నిర్మాణం తప్పా మిగిలిన చోట్ల ముందడుగు పడలేదు. నిధుల కొరత, ఇతర కారణాలతో ప్రగతి ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల 531 పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో చేస్తున్న ప్రగతిలో అదే నిర్లక్ష్యం కొనసాగుతోంది.

# అర్హత ఉన్నా రుణమాఫీ
# మాఫీకి నోచుకోని రైతన్న..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణమాఫీ గందరగోళంగా మారింది. అర్హత ఉన్న రైతులు కూడా రుణమాఫీకి నోచుకోవటం లేదు.అడ్డగోలు నిబంధనలతో కోతలు పెడుతూ మెజా రిటీ రైతులకు ప్రభుత్వం మొండిచేయి చూపిస్తున్నది. దీంతో ప్రభుత్వ తీరుపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు రుణమాఫీ ఎందుకు కాలేదు? అంటూ ప్రశ్నిస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రుణమాఫీఎందుకు కాలేదో చెప్పాలంటూ ఏఈవోలు, బ్యాంకు అధికారు లను నిలదీస్తున్నారు. కొన్నిచోట్ల రైతులు బ్యాంకుల ముందు ధర్నాలు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. మొన్న వరంగల్‌లో, నేడు ఆసిఫాబాద్‌లో రైతులు బ్యాంకులఎదుట ధర్నాకుదిగారు. రైతులకు సమాధానం చెప్పలేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. పైనుంచి వచ్చిన జాబితా ప్రకారమే రుణమాఫీ చేస్తున్నామని చెప్తున్నారు. దీంతో రుణమాఫీ ప్రక్రియ రైతుల్లో గందరగోళం నింపింది. తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో తెలియక రైతులు అయోమయానికి, ఆందోళనకు గురవుతున్నారు. రుణమాఫీకి సంబంధించి కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, ఇందులో 70 లక్షల మందికి రుణ ఖాతాలు ఉన్నాయని, వీరందరికీ రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. కానీ అమల్లోకి వచ్చేసరికి మాత్రం అర్హుల సంఖ్యలో అడ్డంగా కోతపెట్టేశారు. సీఎం చెప్పిన ప్రకారం 70 లక్షల మందికి రుణమాఫీ కావాలి. కానీ ప్రభుత్వం కేవలం 32 లక్షల మందికే రుణమాఫీ చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం ప్రభుత్వం అత్యంత కఠిన నిబంధనలు అమలు చేసినట్టు సమాచారం. అంటే దాదాపు అర్హులైన 40 లక్షల మంది రైతులకు రుణమాఫీలో ప్రభుత్వం మొండి చేయి చూపింది. రుణమాఫీకి పాస్ పుస్తకమే ప్రామాణికమన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆ తర్వాత అత్యంత కఠిన నిబంధనలను అమలు చేస్తున్నారు. ముఖ్యంగా మూడు నిబంధనల ఆధారంగా రుణమాఫీని అమలు చేస్తున్నట్టు తెలిసింది. రేషన్‌కార్డు లేని కుటుంబాలకు రుణమాఫీ చేయడం లేదు. దీంతోపాటు ఆదాయ పన్ను చెల్లించే వారికి కూడా రుణమాఫీ జాబితాలో చోటు దక్కలేదు. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రుణమాఫీలో ప్రభుత్వం చేయి చూపింది. ఈ మూడు నిబంధనల ఆధారంగా ఆయా కుటుంబాల్లోని ఒక్కరికి కూడా రుణమాఫీ చేయడం లేదు.

# యువతలో మార్పు తెచ్చేందుకు
# 'మిషన్ పరివర్తన్'..




**నల్లగొండ,తెలంగాణ దిశ:** డ్రగ్స్, గంజాయికి దూ రంగా ఉండేలా యువతలో మార్పు తెచ్చేందుకే 'మిషన్ పరివర్తన్' అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నా రు. జిల్లా వ్యాప్తంగా గంజాయి తాగుతూ పట్టుపడిన 60మంది యువకులకు జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడ ుతూ, పోలీసశాఖ జిల్లాను గంజాయి, మాదక ద్రవ్యాల రహితంగా మార్చేందుకు 'మిషన్ పరివర్తన్' పేరుతో యువతలో మార్పు తీసు కొచ్చేందుకు ప్రయత్నించడం గొప్ప విషయమన్నారు. మనిషి జీవితంలో 15-30 ఏళ్ల వయసు చాలా ముఖ్యమైనదని, జీవితాన్ని మలుచుకునే దశలో మాదక ద్రవ్యాలకు బానిసవడం ద్వారా జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్ల ల నడవడిక, వ్యవహార శైలిపై శ్రద్ధ చూపాలన్నారు. పిల్లలు వ్యసనాలకు బానిసలు కాకుండా తొలుత తల్లిదండ్రుల్లో అవగాహన రావాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసస్టేషన్ల పరిధిలో గంజాయి టెస్టింగ్ కిట్లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్‌లా గంజాయిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఒకసారి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకుంటే ఆరు నెలల వరకు దాని ప్రభావం శరీరంలో ఉంటుందన్నారు.

గంజాయి తీసుకునేవారికి ఒకటి రెండుసార్లు కౌన్సిలింగ్ ఇచ్చి మళ్లీ పరీక్ష చేస్తామని, మళ్లీ మాదక ద్రవ్యాలు సేవించి పట్టుపడితే ఆరు నెలల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయించినా, తీసుకున్నా డయల్ 100, మొబైల్ నంబర్ 8712670266కు గానీ,సంబంధిత పోలీసస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారంఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం ప్రముఖసైక్రియాటిస్ట్ డాక్టర్ శివకుమార్ పలువీడియోల ద్వారా యువకులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు రమేష్, కొలను శివరాంరెడ్డి, సీఐలు డానియల్‌కుమార్, రవికుమార్, ఆర్ఐ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పథకం అంతా సక్రమమే..!

తిరుపతి :జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. గత వైకాపా పాలనలో ఇంట్లో ఉన్నా ఎంచక్కా వారి ఖాతాల్లోకి ఉపాధి నిధులు జమయిన దుస్థితి. నేతల ఒత్తిడి తోడు అధికారుల అవినీతితో ప్రజాధనం రూ.కోట్లలో పక్కదారి పట్టింది. సామాజిక తనిఖీలు ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పుకొనే అధికారులు.. పథకంలో జరిగిన తప్పిదాలు అరకొరగా బయట పెడుతున్నట్లు విమర్శలు లేకపోలేదు. ప్రభుత్వం మారడం, ప్రజల నుంచి ఫిర్యాదులు అందడం, కూటమి నేతలు గట్టిగా పట్టుబడుతున్న చోటే అవినీతి, అక్రమాలు స్పష్టంగా వెలుగు చూస్తున్నాయి. వారంరోజుల కిందట కేవీబీపురం మండలం కాట్రపల్లి సచివాలయంలో ఎంపీడీవో రెడ్డయ్య, ఏపీవో కుమారస్వామి విచారణ చేపట్టారు. వైకాపా మండల కన్వీనర్, వైకాపా ఎంపీపీ స్వగ్రామం కావడంతో ఐదేళ్లలో భారీ అవినీతి చోటుచేసుకుందంటూ గ్రీవెన్స్‌లో జిల్లా అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో డొంక కదిలింది. విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. అంగన్‌వాడీ ఆయాలు, ఆశ కార్యకర్తలతోపాటు మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలు, 20 సంవత్సరాల కిందట గ్రామం విడిచిపెట్టి వెళ్లినవారు ఉపాధిహామీ పనులు చేసినట్లు చూపించి ఎంచక్కా నిధులు పక్కదోవ పట్టించారు. ఏడాది కిందట ఇక్కడ సామాజిక తనిఖీలు చేపట్టినా వారికి ఈ అవినీతి బాగోతం కనిపించలేదా అంటూ విచారణకు వెళ్లిన అధికారులను స్థానికులు నిలదీశారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో మరెన్నో..! కేవీబీపురం మండలం ఓళ్లూరు గ్రామంలో క్షేత్ర సహాయకురాలిగా పనిచేస్తున్న లీలావతి అవకతవకులకు పాల్పడినట్లు స్థానిక సర్పంచి సురేష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో ఈనెల 7వ తేదీన ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఏపీవో కుమారస్వామి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. దస్త్రాలు పరిశీలించి పీడీకి త్వరలో నివేదిక అందజేయనున్నారు. యర్రావారిపాలెంలో డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ సభ అక్రమాలకే పరాకాష్ఠ.



2023-24లో చేసిన పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు వెల్లడి కావడంతో ఏపీవో ఆశారాణి సహా క్షేత్ర సహాయకులు, కార్యాలయ సిబ్బంది మొత్తాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు పీడీ ప్రకటించారు. సామాజిక తనిఖీలు.. మమ.. ఉపాధిహామీ పనుల్లో జరిగిన తప్పిదాలపై నిర్వహించే సామాజిక తనిఖీలుమమ అనిపిస్తుండటం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. జిల్లాలో పలుమండలాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలు ఇదే విషయం స్పష్టం చేస్తున్నాయి. స్థానిక వైకాపా నేతల కనుసన్నల్లో నిధులు పక్కదారి పట్టినట్లు నెలరోజులవ్యవధిలో వచ్చిన ఫిర్యాదులే చెబుతున్నాయి. ఏపీడీ, ఎంపీడీవో, ఏపీవోవంటి అధికారులు సైతం అయిదేళ్లలో వంతపాడినట్లు స్పష్టమవుతోంది. రికవరీలు ఎంత చూపాలో ముందే నిర్దేశించుకోవడం, ఆవెంటనే చెల్లించడం వంటి చర్యలతో పక్కదోవ పట్టించారు. సామాజిక తనిఖీల్లో ఎక్కడఅవినీతి జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పలు మండలాల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి నివేదికలు ఇంకా అందలేదు. అవినీతి జరిగినట్లు ఫిర్యాదు అందితే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. సిబ్బందిపై వరుసగా చర్యలు తీసుకుంటున్నాం.

# గ్రామ పంచాయతీలకు జవసత్వాలు



అమలాపురం :గ్రామ పంచాయతీల అభివృద్ధికి 100 రోజుల కార్యాచరణను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. గత వైకాపా ప్రభుత్వం పంచాయతీలను నిర్లక్ష్యం చేసి, నిధులను దారి మళ్లించి అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించి నిధులు కేటాయించనుండటంతో జవసత్వాలు రానున్నాయి. పంచాయతీల్లో తాగునీటి వనరులకు సంబంధించిన పథకాలు, చెరువులు, పైపులైన్లు, కుళాయిలు ఎక్కడెక్కడ ఎన్ని, ఏ స్థితిలో ఉన్నాయో పరిశీలన, జియో ట్యాగింగ్ ఇప్పటికే మొదలైంది. గ్రామాల్లో వివిధ రకాల కొళాయి కనెక్షన్లపై కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ నెల 12 వరకు పల్స్ సర్వే నిర్వహించనున్నారు. నీటి నాణ్యత, పరిశుభ్రత, భూగర్భ జలాలు, నీటి వనరులను పరిశీలించి లబ్ధిదారు పేరిట యాప్‌లో నమోదు చేస్తారు. పారిశుద్ధ్య నిర్వహణపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు తొమ్మిది అంశాల్లో ఈ నెల 12 నుంచి 14 వరకు వారి మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణ ఇస్తారు. మురుగు కాలువల నిర్వహణ, చెత్త, వ్యర్థాల నిర్మూలన, మురుగు గుంతల పూడ్చివేత, రహదారుల వెంట గడ్డి, తుప్పల తొలగింపు, ఎల్ఈడీ దీపాల నిర్వహణ వంటివి చేపడతారు. ఎస్‌బీఎం నిధుల నుంచి ప్రభుత్వం సరఫరా చేసిన ట్రాక్టర్లు, రిక్షాలు, డస్ట్ బ్లోయర్లు, హైప్రెజర్ క్లీనర్లు, బుష్ కట్టర్లు, ఇన్‌సినరేటర్లు, చెత్త డబ్బాలు ఉన్నాయా, ఏవిధంగా వినియోగిస్తున్నారనే సమాచారం సేకరిస్తారు. ముగ్గు, బ్లీచింగ్ నిల్వలు, వినియోగంపైనా వివరాలు తీసుకుంటారు. ఏదైనా సామగ్రి కొనుగోలు చేస్తే వెంటనే బిల్లులు ఆన్‌లైన్ చేస్తున్నారా లేదా అనే విషయాలపైనా ఆరా తీస్తారు. సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తారు. తడి పొడి చెత్తను వేరుచేసేందుకు గ్రీన్ అంబాసిడర్లను నియమిస్తారు. వీరికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు విడుదల చేస్తారు. వెక్టరు బోరన్ యాప్ ద్వారా వ్యాధులకు కారణమైన వాటిపై సర్వే నిర్వహిస్తారు. మురుగు, చెత్తకుప్పలున్న ప్రాంతాలను ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేస్తారు. ప్రతి శుక్రవారం డ్రైడే రోజు కార్యక్రమం చేపడతారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 50 శాతం డ్రెయిన్లు, తాగునీటి సరఫరాకు వెచ్చించాలి. గతంలో 15వ ఆర్థిక సంఘం నిధులు ట్రెజరీకి వచ్చేవి. ఇప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేస్తే పంచాయతీలకు బ్యాంకుల ద్వారా చెల్లిస్తారు. నిబంధనల మేరకు గ్రామ పంచాయతీ డెవలప్‌మెంటు ప్లాను (జీపీడీపీ) ప్రకారం నిధులు వెచ్చించాలి. అక్టోబరు 2వ తేదీ నాటికి ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి, సంపద సృష్టి కేంద్రాలకు తరలిస్తాం. అక్కడ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి, మిగిలిన వాటితో వర్మీకంపోస్టు తయారు చేస్తాం.

# సహకార సంఘాలకు బకాయిల భారం!




గుంటూరు: గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీ ఎంఎస్), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్) సేకరిం చాయి. అయితే వైకాపా ప్రభుత్వం మూడేళ్ల నుంచి ఆయా ఏజెన్సీలకు కమీషన్ చెల్లించకుండా బకాయి పెట్టింది. 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు బకాయిలు చెల్లించకపోవడంతో డీసీఎంఎస్, పీఏసీఎస్‌లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇవి రెండూ రైతుల సంక్షేమ కోసం పనిచేసే సంస్థలు కావడంతో బకాయిలు ఆ సంస్థలకు భారంగా మారాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పంటల సాగు ఊపందుకోవడంతో ఎరువులకు డిమాండ్ పెరిగింది. ఈనేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులను డీసీఎం ఎస్, పీఏసీఎస్‌లు క్షేత్రస్థాయిలో సమకూర్చుతుంటాయి. వీటిలో గరిష్ఠ చిల్లర ధరకు ఎరువులు విక్రయించడంతో బహిరంగ మార్కెట్‌లో ఎరు వుల ధరలు పెరగకుండా కట్టడి జరుగుతోంది. అయితే గత వైకాపా ప్రభుత్వం మూడేళ్లు కమీషన్ సొమ్ము చెల్లించకుండా బకాయి పెట్టడంతో ఎరువుల కంపెనీలకు సొమ్ములు చెల్లించి ఎరువులు తెప్పించుకోవడంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రభావం ఎరువుల సరఫరాపై పడుతుందని ఆయా సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మద్దతు ధరకు ధాన్యం సేకరించే క్రమంలో డీసీఎంఎస్, పీఏసీఎస్‌లు సామగ్రి, ఉద్యోగులు, కూలీలను పెట్టి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి పౌరసరఫరాల సంస్థకు అప్పగించారు. ఇందుకు క్వింటాకు రూ.32 ధాన్యం సేకరణ చేసిన డీసీఎంఎస్, పీఏసీఎస్‌లకు కమీషన్‌గా చెల్లిస్తారు. ఈ సొమ్మును ధాన్యం సేకరణ ఏడాది లేదా తర్వాత సీజన్ నాటికి చెల్లింపులు పూర్తిచేసేవారు. అయితే 2020-21 నుంచి ఇప్పటివరకు గత వైకాపా ప్రభుత్వం కమీషన్ చెల్లించకుండా బకాయిలు పెడుతూ వచ్చింది. డీసీఎంఎస్‌కు రూ.11.50కోట్లు, పీఏసీఎస్‌లకు రూ.2కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉంది. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు ఎప్పటికప్పుడు కమీషన్ సొమ్ము చెల్లించాలని కోరుతున్నా స్పందన ఉండటం లేదు. అయితే డీసీఎంఎస్, పీఏసీఎస్ సంస్థలు ధాన్యం సేకరణ చేసిన ఏడాదే కమీషన్ సొమ్ముకు సంబంధించి ఆదాయపు పన్ను, ఇతర పన్నులు కలిపి సుమారు 27శాతం వరకు చెల్లించారు. ఒకవైపు బకాయిలు రాకపోవడం, మరోవైపు ముందస్తు పన్నులు చెల్లించడంతో రెండు విధాలా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎరువుల సీజన్ మొదలైనందున వెంటనే బకాయిలు విడుదల చేస్తే కొంత ఊరట లభిస్తుందని కోరుతున్నారు. వైకాపా ప్రభుత్వం చెల్లించకుండా పోయిన బకాయిలు ఇప్పుడు ఆయా సంస్థలకు శాపంగా మారాయి. రైతుకు మేలు చేస్తామని గొప్పలు చెప్పిన గత ప్రభుత్వం రైతులకు సేవలు అందించే సంస్థలకు బకాయిలు పెట్టి ఆర్థికంగా ఇబ్బందుల్లో నెట్టేయడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి సవిత

గోరంట్ల:గోరంట్ల మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో పరిష్కరించాల్సి ఉంది. అన్నింటిపైనా దృష్టి సారించి ఒక్కొక్కటి పూర్తి చేస్తామని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా మొదటిసారి గోరంట్ల మండలంలో ఆమె పర్యటించడంతో జనం నీరాజనం పలికారు. మల్లాపల్లిలో ఆపిల్‌పండ్ల గజమాలతో సత్కరించారు. గుమ్మయ్యగారిపల్లి కూడలిలో అంగన్‌వాడీ సిబ్బంది స్వాగతం పలికి మంత్రితో కలిసి కేకు కట్‌చేశారు. కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత, గోరంట్ల ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన రాతపుస్తకాల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. గౌనివారిపల్లిలో చౌకధరల దుకాణం ప్రారంభించారు. అనంతరం గోరంట్లకు చేరుకుని ఆంజనేయస్వామి కాలనీలో సర్పంచి సరోజబాయి, ఎంపీపీ ప్రమీళ, మాజీ సర్పంచి చంద్రశేఖర్, కార్యదర్శి బాబురావుతో కలిసి సిమెంటు రహదారి, శివాలయం కాలనీలో వెంకటరమణప్ప సొంతనిధులతో నిర్మిస్తున్న సిమెంటు రహదారులకు భూమి పూజ చేశారు. పలు కూడళ్లలో ప్రసంగించారు. గోరంట్ల మండల ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఎన్నికల



సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వైకాపా ప్రగల్భాలను తిప్పికొట్టామన్నారు. మండల కన్వీనర్ సోమశేఖర్, మండల నాయకులు ఉత్తమరెడ్డి, బాలకృష్ణచౌదరి, నరేష్, సుబ్రహ్మణ్యం, రఘునాథరెడ్డి, యువశేఖర్, శ్రీనివాసులు, జయచంద్ర, అజ్మతుల్లా, ఉమర్‌ఖాన్, శ్రీధర్, మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెత్తకుప్పలు ఇలా.. పారిశుధ్యమెలా?

పెద్దతిప్పసముద్రం :పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి చెత్తకుప్పలు పేరుకుపోయి పరిశుభ్రత ప్రశ్నార్థకం గా మారింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా తయారై పారిశుధ్యమెరుగునకు పెనుసవాలుగా నిలి చింది. గ్రామాల్లో పడిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి చెత్త నుంచి సంపదను సృష్టించే విదానాన్ని 2014-19 సంవత్సరాల మద్యకా లంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పక్కా ప్రణాళికతో పటిష్టంగా అమలు చేసింది. ఇందులోభాగంగా మండలంలోని ఆయా పంచా యతీలకు లక్షలు వెచ్చించి డంపింగ్ యార్డు నిర్మాణాలు చేపట్టి వాటి నిర్వహణల కోసం గ్రీన అంబాసిడర్లను ఏర్పాటు చేసి వారిచే పని చేయించాల్సిన బాధ్యతలను ఆయా పంచాయతీలకు అప్పగించింది. అయితే 2019 సంవత్సరంలో అధికా రంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీల్లో ఉన్న డంపింగ్ యార్డులను పట్టించుకోక పోవడంతో డంపింగ్ యార్డులు నిర్వీర్యమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో చెత్తాచెదారంతోపాటు మురుగు కాలువల్లో సైతం చెత్తతో పేరుకుపోయాయి. కాగా గ్రీన అంబా సిడర్లకు జీతాలు చెల్లించకపోవ డంతో చెత్తనుంచి సంపద సృష్టించే కేంద్రాలు నిరుపయోగంగా మారి పోయాయి. మండల కేంద్రమైన పీటీ ఎంలో ఉన్న డంపింగ్ యార్డు ఉన్నా పంచాయతీ కార్మికులు చెత్తను డంపింగ్ యార్డులో కాకుండా బహిరంగ ప్రదేశాల్లో పారబోసి చెత్తకు నిప్పు పెడుతుండడంతో కాలు ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా బూర్లపల్లె గ్రామంలో డంపింగ్ యార్డు ఉన్నప్పటికి చెత్తను అందులో వేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం




అధికారంలోకి రావడంతో ఇకనైనా ఆయా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగవుపడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఆయా గ్రామా ల్లో ఉన్న డంపింగ్ యార్డులను సద్వినియోగం చేసుకుని చెత్తనుంచి సంపదను సృష్టించే కార్యక్రమాలను మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. పెద్దమండ్యం గ్రామ పంచాయతీలో చెత్త సేక రణ వాహనం మరమ్మత్తులకు నోచుకోక నిరుపయోగంగా మూలనప డింది. వివరాల్లోకి వెలితే గత వైసీపీ ప్రభుత్వంలో స్వచ్ఛ భారత పథ కం ద్వారా పైలట్ ప్రాజెక్టు కింద పెద్దమండ్యం గ్రామ పంచాయతీకి చెత్త సేకరణ వాహనం కేటాయించారు. ఆ వాహనాన్ని ఆర్భాటంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. అయితే గత ఒకటన్నర ఏడాది క్రితం ఆ వాహనం మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి వాహనాన్ని పట్టించుకోకపోవడంతో అది ప్రస్తుతం కదలేదని పరిస్థితి లో ఉంది.

# ఏనుగుల సంచారంతో భయాందోళన



వంగర: మండలం లోని వీవీఆర్ పేట, రాజులగుమ్మడ గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఏనుగుల గుంపు సంచరించింది. ఈ గుంపులో ఆరు ఏనుగుల తో పాటు చిన్న ఏనుగు పిల్ల కూడా ఉంది. ఈ ఏనుగులు ఆయా గ్రామాల్లోని మొక్కజొన్న, వరి, కూరగాయ పంటలను నేలమట్టం చేశాయి. దీంతో ఆయా రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని వంగర మండలంలోగల వీవీఆర్ పేట, రాజులగుమ్మడ గ్రామాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపును తక్షణమే తరలించేలా అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు గ్రామాల్లో ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వాటిని మండలం నుంచి తక్షణమే తరలించాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమై ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కూడా శ్రీహరిపురం, దేవకివాడ, మద్దువలస, మగ్గూరు, సంగాం, ఓనె అగ్రహారం గ్రామాల్లో కూడా పంటలను నాసనం చేశాయని ప్రస్తుతం ఆ పరిస్థితి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోండ్రు ఆదేశించారు. ఈ విషయంపై అటవీ శాఖ ఉన్నతాధికారులుకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

# చెత్త వాహనాల్లోనూ నొక్కుడే !

భీమవరం:పట్టణాల్లో చెత్త సేకరణకు ఉపయోగిస్తున్న వాహనాలు మున్సిపాలిటీవి కావు. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. ఏజన్సీ ద్వారా వాహనాలు కేటాయించింది. మున్సిపాలిటీలకు వాహ నాలతో సంబంధం లేదు. ప్రతినెలా ఏజన్సీకి వాయిదా రూపంలో సొమ్ములు చెల్లించాల్సి ఉంటుంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో ఈ విధానాన్ని అమలు చేశారు. అవే వాహనాలు ఇప్పటికీ మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు ఉపయోగిస్తున్నారు. గతంలో ప్రజా?ధనాన్ని దుర్వినియోగం చేశారు. చెత్త పన్ను వసూలు చేసి బ్యాంకుల్లో జమ చేసేవారు. అక్కడ నుంచి నేరుగా ప్రభుత్వానికి వెళ్లిపోయేవి. ప్రభుత్వమే ఏజన్సీకి సొమ్ములు చెల్లించేది. ఇలా ప్రతినెలా వాయిదాలు చెల్లించేలా ఏజన్సీతో గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దీని వెనుక పెద్ద కుంభ కోణమే జరిగిందంటూ ఇప్పుడు కూటమి నేతలు అనుమాని స్తున్నారు. లేదంటే త క్కువ ఖరీదుతో లభ్యమయ్యే వాహనాలకు పెద్ద మొత్తంలో ప్రతినెలా వాయిదాలు చెల్లించడమేమిటని కూటమి ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం చెత్తపన్ను వసూళ్లను నిలిపివేసింది. దాంతో వాయిదాలు మొత్తం మున్సి పాలిటీలే చెల్లించే పరిస్థితి నెలకొంది. ప్రతినెలా లక్షలాది రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. గడచిన ఆరు నెలల నుంచి బకాయిలు పేరుకు పోయాయి. భీమవరం మున్సిపాలిటీలోనే రూ. 1.20 కోట్లు బకాయి పడ్డారు.

అంత పెద్దమొత్తంలో చెల్లించేందుకు మున్సి పాలిటీ వద్ద నిధులు లేవు. ఎలా చెల్లిస్తామంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వానికి లేఖ రాసేందుకు సిద్ధమవుతున్నారు. భీమవరం పురపాలక సంఘమే ఇలా ఆలోచిస్తోందంటే జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థమవుతుంది.

# ధాన్యంలో దళారుల దందా!

తడ:ఒకప్పుడు నెల్లూరు మొలగొలుకులు ఫేమస్. ఆరు నెలల పాటు రైతు శ్రమించి దిగుబడి చేసే ధాన్యం రకమది. దీనిపై అన్నివర్గాల వారు మక్కువ చూపేవారు. తర్వాత సన్నరకాలకు గిరాకి వచ్చింది. అందులో ముఖ్యమైంది బీపీటీ 5224 (బాపట్ల జిలకర) ధాన్యం. ఈ పంట కేవలం 90 రోజుల నుంచి వంద రోజుల్లోపు రైతు చేతికి వస్తుంది. తినేందుకు తియ్యగా.. తృప్తిగా అనిపించే రకం ధాన్యం. ప్రస్తుతం ఈ రకం ధాన్యం ధర పుట్టి రూ.26,450. ఈ రకానికి మార్కెట్లో గిరాకి ఏర్పడింది. ఇటీవల బీపీటీలను పోలిన ఎన్ఎల్ఆర్ 3449 (నెల్లూరు జిలకర) రకం ధాన్యం అందుబాటులోకి వచ్చింది. ఈ ధాన్యం 80 రోజుల్లోనే చేతికొస్తుంది. పైగా ఎటువంటి తెగుళ్లకు ఆస్కారం లేకుండా రైతు ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుంది. నాణ్యత అంతంత మాత్రమే. రుచి ఉండక పోవడంతో ఎవరూ ఇష్టపడడం లేదు. ధరల్లో సైతం భారీ వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం ఎన్ఎల్ఆర్ 5224 పుట్టి ధర రూ.14,950గా ఉంది. అంటే బీపీటీ రకాలకు, ఎన్ఎల్ఆర్ 5224 రకం ధాన్యానికి మధ్య వ్యత్యాసం సుమారు రూ.11,500గా ఉంది. ఇదే దళారులకు, మిల్లర్లకు అవకాశంగా మారింది. బీపీటీ, ఎన్ఎల్ఆర్ రకాలు చూసేందుకు ఒకేలా ఉంటాయి. రైతులకు, మిల్లర్లకు తప్ప అందులో వ్యత్యాసం గుర్తించడం కష్టం. దీనికితోడు ఈ రెండు రకాల ధాన్యాలను ఆడించి బియ్యం చేస్తే ఇక ఎవ్వరూ కనిపెట్టలేరు. ఇదే దళారులకు అనుకూలమైంది. రైతుల



నుంచి రెండు రకాల ధాన్యాలను కొనుగోలు చేసే దళారులు, మిల్లర్లు కొన్ని ప్రదేశాల్లో ఈ రెండు రకాల ధాన్యాలను కలబోస్తారు. మూడు వంతుల బీజీటీ రకం ధాన్యంలో ఓ వంతు ఎన్ఎల్ఆర్ రకాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నారు. తద్వారా ఎన్ఎల్ఆర్ రకానికి కూడా బీపీటీ ధాన్యం ధరనే దళారులు వసూలు చేస్తున్నారు. ఈ దందా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, దొరవారిసత్రం, పెళ్లకూరు మండలాల్లో భారీ ఎత్తున జరుగుతున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

# నగరపాలక అధికారులపై 'విజిలెన్స్'!

తిరుపతి, : తిరుపతి నగర పాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ మంత్రి నారాయణ ఆదేశించారు. ఆమేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి విభాగపు స్పెషల్ చీఫ్ సెక్రటరీకి లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి నగరపాలక సంస్థలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజాదర్బార్ (ఆర్టీజీ)లో భాగంగా మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. ఈక్రమంలో మంత్రి నారాయణకు తిరుపతి కార్పొరేషన్లోని అవినీతి అధికారుల గుట్టు విప్పాలని మంత్రి లోకేశ్ ద్వారా ఫిర్యాదులు వెళ్లాయి. దాంతో విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ నారాయణ నిర్ణయం తీసుకోవడంతో అవినీతి అధికారుల్లో గుబులు పట్టుకుంది. తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. రూ.4వేల కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగినట్టు అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నేతలు ఆరోపించారు. అభివృద్ధి పేరుతో తుడా వేయాల్సిన మాస్టర్ ప్లాన్ రోడ్లను పక్కా ప్రణాళికతో తెరపైకి తీసుకొచ్చి స్థలాలు కోల్పోయిన వారి పేర్లతో బాండ్లు తీసుకుని కోట్లు కొల్లగొట్టారు. అగ్రికల్చర్,




రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధి పొందారు.

వైసీపీ నేతల జేబుల్లోకి దాదాపు రూ.400 కోట్ల వరకు వెళ్లినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగంలో ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగమయ్యాయన్న విమర్శలూ ఉన్నాయి. ఇక గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులపై కూడా విచారణ జరగనున్నట్టు తెలుస్తోంది.

# 'ఆ' సమస్యపై బహిరంగ చర్చ అవసరం..!

కొన్ని విషయాలు చాలా చిన్నవిగా కనిపిస్తాయి. కానీ ఆరోగ్య పరంగా వాటి పరిణామాలు మాత్రం చాలా తీవ్రంగా ఉంటాయి. ముఖ్యంగా మహిళల విషయంలో ఇవి చాలా ప్రభావం చూపిస్తుంటాయి. అలా పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు అంతంతమాత్రమే ఉన్నచోట వారు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఇటీవల రైల్వే బోర్డుకు మహిళా లోకో పైలట్లు రాసిన లేఖలో ఇది స్పష్టమైంది. 'పేలవమైన పని పరిస్థితులు తమ ఆరోగ్యానికి హాని కలిగించాయని, సరైన మరుగుదొడ్లు లేక యుటిఐ, గర్భస్రావాలకు కూడా కారణమయ్యాయ'ని ఆ ఉద్యోగినులు ఆవేదనతో రాసిన లేఖ చర్చకు దారితీసే అంశం. తాము ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి ఎదురైన అనుభవాలు వారి మాటల్లోనే తెలుసుకుందాం.

మీనా (పేరు మార్చబడింది) మధ్యప్రదేశ్ వాసి. అసిస్టెంట్ లోకోపైలట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. 2021 మే నెలలో విధుల్లో ఉండగానే ఆమెకు పొట్టకింద భాగంలో విపరీతమైన నొప్పి వచ్చింది. మొదట్లో అది మామూలు గ్యాస్ నొప్పని ఆమె అశ్రద్ధ చేసింది. అంతకుముందు చాలాసార్లు తను ఆ నొప్పిని భరించింది. కానీ ఈసారి అలా లేదు. దీంతో డాక్టరుని కలిసింది. అక్కడ ఆమెకి ఓ చేదు నిజం తెలిసింది. 'డాక్టర్లు మొదట నాకు పెయిన్‌కిల్లర్‌లు ఇచ్చారు. అయితే సోనోగ్రఫీ చేయించుకోమని సూచించారు. నేను మొదట ఇది గ్యాస్ నొప్పని భావించాను. ఒకవేళ అదీ కాకపోతే యూరిన్ ఇన్‌ఫెక్షన్ ఉంటుందని అనుకున్నాను. కానీ ఆ రెండు జరగలేదు. సోనోగ్రఫీ పరీక్షలో నా కిడ్నీ పక్కన పెద్ద చీముగడ్డ తయారైందని తేలింద'ని ఆమె చెప్పింది. వెంటనే దానికి చికిత్స తీసుకోకపోతే, ఆ గడ్డ పగిలి, అంతర్గత అవయవాలు దెబ్బతింటాయని డాక్టర్లు మీనాకి చెప్పారు. సిక్ లీవ్ తీసుకుని ఆపరేషన్ చేయించుకుంది. సకాలంలో తెలుసుకోవడం వల్ల పెద్ద ప్రమాదం నుండి బయటపడ్డావని డాక్టరు అన్నారు. యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ వల్లే గడ్డ ఏర్పడినట్లు తెలుసుకున్న మీనా పని ప్రదేశంలో తను, తనలాంటి వారు పడే ఎన్నో ఇబ్బందులపై మాట్లాడారు.





**నీళ్లు తక్కువ తాగేవాళ్లం:** గూడ్స్ ట్రైన్ లోకో పైలట్‌గా మీనా సుదీర్ఘ పని గంటలు పనిచేస్తున్నారు. 'బ్రేక్ లేకుండా 12 గంటలు పనిచేయాలి. ఈ సమయంలో మా సిబ్బందిలో ఎవరమూ వాష్‌రూమ్ ఉపయోగించుకునేవాళ్లం కాదు. యూరిన్ రాకుండా ఉండేందుకు నీళ్లు తక్కువ తాగేవాళ్లం. ఒకవేళ వెళ్లాల్సివచ్చినా, బలవంతంగా ఆపుకునేవాళ్లం. ఇలా చాలా సార్లు జరిగింది. ఇలా చేయడం వల్లే నేను ఇంత అనారోగ్యానికి గురయ్యాను. అయితే ఈ సమస్య నా ఒక్కదానిదే కాదు' అంటున్నారు ఆమె.

**ప్లాట్‌ఫామ్, రన్నింగ్‌రూమ్‌లోనే..:** ఉత్తరప్రదేశ్‌కి చెందిన సమీరా తాను ఎదుర్కొన్న సమస్యల గురించి ఇలా చెబుతోంది. 'సాధారణంగా చాలా ట్రైన్లలో వాష్‌రూమ్ క్యాబిన్లు ఉండవు. ఒకవేళ ఉన్నా వాటిల్లో ఎక్కువ గంటలు నీటి సౌకర్యం ఉండదు. స్టేషన్లో కూడా మాకోసం స్పెషల్ వాష్‌రూమ్‌లు లేవు. అర్జంటుగా వెళ్లాల్సివచ్చినప్పుడు మేము స్టేషను ప్లాట్‌ఫామ్ లేదా రన్నింగ్ రూమ్ వరకు వెళతాం. అక్కడికి చేరుకోవడానికి సుమారు 5 నిమిషాలు పడుతుంది' అని అంటోంది.

30 ఏళ్ల సమీర వివాహిత. పిల్లలను కనాలని ప్లాన్ చేసుకుంటోంది. ఈ సమయంలోనే ఆమె మొదటిసారి గర్భం దాల్చింది. పుట్టబోయే పండంటి బిడ్డ కోసం ఎన్నో కలలు కంది. అయితే విపరీత పనిగంటలు, ఒత్తిడి వల్ల మూడు నెలలకే ఆమె తన బిడ్డను కోల్పోయింది. ఇది ఒకటి, రెండు సార్లు కాదు. వరుసగా నాలుగైదు సార్లు జరిగింది. ఈ బాధ ఆమెని మానసికంగా కుంగదీసింది. ఇప్పుడు ఆరోసారి గర్భందాల్చినా ఆమె తీవ్ర భయందోళనల మధ్యే విధులకు హాజరవుతోంది.

**ప్రత్యేక సదుపాయాలు లేవు:** లోకోపైలట్ జూహీ కూడా తన అనుభవాన్ని ఇలా చెబుతోంది.. 'పని ప్రదేశంలో మరుగుదొడ్ల సమస్య ప్రతి మహిళా ఎదుర్కొనే సాధారణ సమస్య. ఒక్క మరుగుదొడ్లే కాదు, ఏ పని చేయాలన్నా వారి శక్తికి మించి పనిచేయాల్సి వస్తుంది. మాల్స్, హెూటల్స్, హాస్పిటల్స్, బట్టల దుకాణాలు వంటి తదితర సంస్థల్లో పనిచేసే మహిళల కోసం అక్కడ ప్రత్యేక సదుపాయాలంటూ ఏమీ ఉండవు. మా క్యాబిన్ నుండి కిందకి దిగడానికి మేము నిచ్చెనలు ఉపయోగించాల్సి వస్తుంది. అవి నేల నుండి చాలా ఎత్తుకి బిగించబడి ఉంటాయి. దీంతో మేము 3 నుండి 4 అడుగుల దూరం కిందికి, పైకి దుమకాల్సి వస్తుంది. ఒక్కోసారి గూడ్సు ట్రైను ప్లాట్‌ఫారమ్ దగ్గర ఆగదు. అప్పుడు మా బాధ మరింత పెరుగుతుంది' అని చెప్పిన జూహీ, గతేడాది తన క్యాబిన్ నుండి కిందికి దిగుతూ కాలు జారి పడిపోయింది. భుజాలకి తీవ్ర గాయాలయ్యాయి.

చికిత్స తీసుకుని విధుల్లో చేరినా లోకోపైలట్‌గా పనిచేసే శక్తి లేక ఆఫీసుపని చేస్తానని అభ్యర్థించింది. అయితే చాలా తక్కువ కాలంలోనే తిరిగి విధుల్లోకి చేరమని ఆమెపై ఒత్తిడి ఎక్కువైంది. ఈ పరిస్థితినే ఆమె తన మాటల్లో ఇలా చెబుతోంది.

'చాలా మంది మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడాలని కోరుకుంటారు. కానీ పని చేసే చోట సరైన మౌలిక సదుపాయాలు లేక నానా యాతనలు పడతారు. మహిళలు పనిచేసే ప్రతి రంగంలోనూ ఆమెకంటూ ప్రత్యేక వసతులు కల్పించడం కనీస బాధ్యత' అని జూహీ తన ఆవేదనను వ్యక్తపరిచారు.

ఇండియన్ రైల్వేస్‌లో మహిళా లోకోపైలట్లు 2000 మందికి పైగాఉన్నారు. వీరిలో అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న వారిలో అత్యధికులు యూరినరీ ఇన్‌ఫెక్షన్ల సమస్యతో బాధపడు తున్న వారేనని ఓ ప్రముఖ మీడియా సంస్థ చేసిన సర్వేలో తేలింది. అపరిశుభ్ర వాతావరణం వల్ల యూరిన్ ఇన్‌ఫెక్షన్, యుటెరన్ ఫైబ్రాయిడ్స్, అధిక రక్తపోటు,గర్భస్రావాలు తరచూ ఈ లోకోపైల ట్లు ఎదుర్కొంటున్నట్లు కూడా నివేదికలో స్పష్టమైంది. మీనా, సమీర, జూహీ.. మాత్రమే పని ప్రదేశంలో సమస్యలు ఎదుర్కొనడం లేదు. ఏరంగమైనా, ఏ స్థాయి ఉద్యోగమైనా ప్రతి మహిళా కనీస సౌకర్యాలు లేకతీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కానీ ఎక్కడో కొన్ని చోట్ల మాత్రమే ఆ సమస్యలు వెలుగులోకి వస్తాయి. సమస్యలపై స్పందించడంలో ఈ మహిళలు ఒకడుగు ముందుకు వేశారు. వీరు వేసిన బాట ఎంతోమందికి ఆదర్శం.

## స్విస్ లో బురఖా బ్యాన్

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌లో బహిరంగ ప్రదేశాల్లో బురఖా ధరించడంపై నిషేధం అమల్లోకి వచ్చింది. ప్రజలు తిరిగే ప్రైవేట్ భవనాల్లో కూడా బురఖా నిషేధించబడుతుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి 1,000 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 96,947) జరిమానా విధించబడుతుంది. ఈ నిర్ణయాన్ని ముస్లిం సంస్థలు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021లో జరిగిన దేశవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణలో, 51 శాతం మంది బురఖా నిషేధానికి అనుకూలంగా ఓటు వేశారు. ఈ నిర్ణయాన్ని అక్కడి పార్లమెంట్ కూడా ఆమోదించింది. దాదాపు 8.85 మిలియన్ల జనాభా కలిగిన స్విట్జర్లాండ్‌లో, ముస్లింలు 5శాతం ఉన్నారు. ఈ కొత్త చట్టం ప్రకారం, బహిరంగ ప్రదేశాల్లో ముఖాన్ని కప్పి ఉంచడంనిషేధించబడింది, ఈ నిబంధనను ఉల్లంఘిస్తే వెయ్యి స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ.96 వేలు) జరిమానా విధించబడుతుంది. స్విట్జర్లాండ్‌లో 2021 ప్రజాభిప్రాయ సేకరణలో ఆమోదించబడిన ఈ నిషేధాన్ని ముస్లిం సంస్థలు విమర్శించాయి. విశేషమేమిటంటే, 2009లో దేశంలో కొత్త మినార్ల నిర్మాణాన్ని నిషేధించిన గ్రూపునే బురఖాపై నిషేధం విధించింది. 2021లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో స్విట్జర్లాండ్‌లో 51.21 శాతం మంది ప్రజలు ఈ నిషేధానికి మద్దతుగా ఓటు వేశారు. మితవాద స్విస్ పీపుల్స్ పార్టీ దేశంలో బురఖా నిషేధాన్ని ప్రతిపాదించింది, ఇది దేశ సాంస్కృతిక విలువలు, ప్రజా భద్రతను కాపాడుతుందని వాదించింది. దీని తరువాత, 2022 సంవత్సరంలో దేశ జాతీయ కౌన్సిల్ ఈ చట్టాన్ని ఆమోదించింది. దీని ప్రకారం, బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, దుకాణాలు, రెస్టారెంట్లలో మహిళలు తమ ముఖాలను పూర్తిగా కప్పి ఉంచడం నిషేధించబడింది. బురఖా నిషేధానికి సంబంధించి స్విస్ ప్రభుత్వం విమానాల్లో లేదా దౌత్య,కాన్సులర్ ప్రాంగణాల్లో బురఖా నిషేధం వర్తించదని స్పష్టం చేసింది. ఇది కాకుండా, మతపరమైన ప్రదే శాలు, ఇతర పవిత్ర ప్రదేశాలలో ఒక వ్యక్తి తన ముఖాన్ని కప్పుకోవడానికి కూడా అనుమతించబడతారు. ఆరోగ్యం, భద్రతా కారణాలు, సాంప్రదాయ ఆచారాలు లేదా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఫేస్ కవర్లు అనుమతించబడతాయని ప్రభుత్వం తెలిపింది. కారణాలతో పాటు ప్రకటనల ప్రయోజనాల కోసంవారికి ఈ ఆమోదం మంజూరు చేసింది. సెప్టెంబరు 2022లో కొంతమంది ముస్లిం మహిళలు ధరించే బురఖా వంటి ముఖ కవచాలను నిషేధించాలని స్విట్జర్లాండ్ పార్లమెంటు దిగువ సభ ఓటు వేసింది.

## ఏపీలో వైరల్ అవుతున్న సోషల్ మీడియా క్యాంపెయిన్స్!

**గుంటూరు,తెలంగాణ దిశ:** సోషల్ మీడియాపై ఏపీ సర్కార్ నయా ప్రచారాన్ని ప్రారంభించింది. సోషల్ మీడియాను మంచికి వాడుదామంటూ భారీ హోర్డింగ్‌లతో ప్రజలకు పిలుపు ఇస్తుంది. మరోవైపు సినీ సెలబ్రిటీలు కూడా రంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాను మంచి కోసమే ఉపయోగించుకోవాలని, అంతే తప్పా తప్పుడు ప్రచారంతో ఇతరుల పట్ల ద్వేషం ప్రదర్శించొద్దని కోరుతున్నారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రచారం, విద్వేష, విషపూరిత రాతలు వద్దని కోరుతోంది. చెడు పోస్టులు చేయొద్దని విజ్ఞప్తి చేస్తోంది. అసత్య ప్రచారాలకు, దూషణలకు స్వస్తి పలుకుదా మంటూ ప్రజలకు పిలుపు ఇస్తోంది. సోషల్ మీడియాపై ప్రజల ను, నెటిజన్లను చైతన్యపరిచేలా పోస్టులు చేయాలని సూచిస్తోంది. సోషల్ మీడియాను మంచికి వాడుదాం అంటూ పలు నగరాల్లో భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు వెలిశాయి. అలాగే ఆటోలపై పోస్టర్లు అతికించి ప్రచారం చేస్తోన్నారు. చెడు వినొద్దు, చెడు చూడొద్దు, చెడు మాట్లాడవద్దు అనే గాంధీజీ సూక్తి కాన్సెప్ట్‌తో సోషల్ మీడియాపై క్యాంపెయిన్ చేస్తోంది. త్రీ మంకీస్ బొమ్మకు ఫోర్త్ మంకీ చేర్చి చెడు పోస్టులు వద్దంటూ ఆసక్తికరంగా హోర్డింగులు ప్రభుత్వం పెట్టింది. పోస్ట్ నో ఈవిల్ (చెడు పోస్టు వద్దు) పేరుతో నాలుగో మంకీ బొమ్మతోభారీ హోర్డింగ్‌ల ఏర్పాటు చేశారు. మేక్ సోషల్ మీడియా ఎ పాజిటివ్ ఎక్స్ పీరియన్స్ పేరుతో ప్రధాన కూడళ్లలో హోర్డింగ్స్ పెట్టారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రచారం చేయవద్దని, విద్వేష, విషపూరిత రాతలు వద్దంటూ ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాను మంచికి, పాజిటివ్ అంశాలకు వేదికగా మార్చుదామని అనే స్లోగన్‌తో పిలుపు ఇస్తున్నారు. విజయవాడ– గుంటూరు దారిలో తాడేపల్లి హైవే వద్ద భారీ హోర్డింగ్‌ల పెట్టారు. రాజధాని అమరావతితో పాటు తిరుపతి, విశాఖపట్నం వంటి నగరాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అందరికీ అర్థమయ్యేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో వీటిని ప్రదర్శించారు. సోషల్ మీడియాలో విష ప్రచారాన్ని, వ్యక్తిత్వ హననాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం, ఈ తరహా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇప్పటికే బూతులు, మార్ఫింగ్‌లతో పోస్టుల పెట్టిన వారిపై ఇప్పటికే ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. సోషల్ మీడియాపై ప్రజలను, నెటిజన్లను చైతన్యపరిచేలా తాజాగా క్యాంపెయిన్ నిర్వహిస్తోంది. ఈ క్యాంపెయిన్‌లో హీరో, హీరోయిన్ సినీ ప్రముఖులు భాగస్వామ్యం అయ్యారు. శ్రీలీల, అడవి శేషు, అఖిల్ తదితర నటీనటులు కూడా ప్రచారం చేస్తున్నారు. హీరోయిన్ శ్రీలీల వీడియో విడుదల చేశారు. "లైక్స్ కోసం, వ్యూస్ కోసమని తప్పుడు వార్తాలను ప్రచారం చేయొద్దు. మీ వ్యూస్ కోసం ఇంకొకరిని యూజ్ చేసుకోవద్దు. అసత్య ప్రచారాలకు దూరంగా ఉందాం. సామాజిక బాధ్యత వహిద్దాం" అంటూ పేర్కొన్నారు. హీరో నిఖిల్ విడుదల చేసిన వీడియోలో "మనం ఒక వస్తువు కొనేటప్పుడు ఎలాగైతే ఎక్స్‌పైర్ డేట్ చూస్తాం.

కానీ సోషల్ మీడియాలో పోస్టు చేసేటప్పుడు అది నిజమా? కాదా? అని ఎందుకు చెక్ చేయం. ఎందుకంటే ఏమవుతుందిలే అనే క్యాజువల్‌గా తీసుకుంటాం. కానీ మీరు సరదాగా షేర్ చేసే ఆ ఫేక్ న్యూస్ కొన్ని జీవితాలను నాశనం చేస్తోంది. కనుక మీరు న్యూస్ షేర్ చేసేముందు, అది నిజమా? కాదా? అని ఒకసారి చెక్ చేసుకోండి. సోషల్ మీడియాను పది మందికి ఉపయోగపడేలా వాడుదాం. అంతేతప్ప ఇబ్బందిపెట్టేలా కాదు" అంటూ పేర్కొన్నారు. నటుడు అడవి శేషు విడుదల చేసిన వీడియోలో "ఏమ వుతుందిలే అనుకుని ఒక అమ్మాయి పోస్టు కింద చెడ్డ కామెంట్ పెడితే, అది చదివి వారు ఆందోళన చెందుతారు. ఏం కాదులే అనుకుని ఫేక్ న్యూస్ షేర్ చేస్తే, అదే నిజమని చాలా మంది అనుకుంటారు. సో కాస్తా ఆలోచిద్దాం. బాధ్యతగా ఫేక్‌న్యూస్‌షేర్ చేయొద్దు. చెడ్డ కామెంట్లు పెట్టొద్దు" అనిఅన్నారు. మరోవైపు జనసేన పార్టీ కూడా సోషల్ మీడియా వేదికగా క్యాంపెయిన్ నిర్వహిస్తోంది.

అందరికీ అర్థమయ్యేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో వీటిని ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాను మంచి కోసం వాడుదాం అంటూ ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ద్వారా చైతన్యం తెచ్చేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. చిన్న చిన్న పోస్టర్లు కాదు ఏకంగాపెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ ఫ్లెక్సీలు చర్చనీయాంశం అవుతున్నాయి. సోషల్ మీడియా వల్ల జరుగుతున్న అనర్థాలు.. మంచి కోసం ఎలా ఉపయోగించుకోవాలన్న చర్చ కూడా వస్తోంది. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. వీటిని ఎవరు ఏర్పాటు చేశారనేదానిపై మాత్రం స్పష్టత లేదు.

సినిమా తారలతోనూ ప్రచారం చేయిస్తున్నారు. సలహాలు,నీతులు ఉరకనే చెబుతారు. భారీ హోర్డింగ్‌లకు వేలల్లో వసూలు చేస్తారు ఇలా అన్ని సిటీల్లో వేయాలంటే లక్షలు ఖర్చవుతుంది.

అయినా ఎవరూ ఖర్చుపెట్టి చెప్పరు. కానీ ఏపీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలవిషయంలోఎవరి పేర్లులేవు. ప్రభుత్వం ఏర్పాటుచేసిఉంటే జారీచేసిన వారు సమాచార, ప్రచార సంబంధాల శాఖఅని వేసుకునేవారు. కానీఅలా వేయలేదు.

## కొడాలి నాని అరెస్ట్ తప్పదా..?



**విజయవాడ,తెలంగాణ దిశ:** కొత్త సంవత్సరంలో మాజీ మంత్రి కొడాలి నాని అరెస్టు తప్పదని విశ్లేషణలు ఉన్నాయి. సరిగ్గా ఇదే సమయంలో ఆయన ప్రధాన అనుచరుడిని గుడివాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన నుంచి కీలక వాంగ్మూలం సేకరించినట్లు సమాచారం. మాజీ మంత్రి కొడాలి నాని అరెస్టు తప్పదా? ఆయనను ఏ క్షణంలోనైనా పోలీసులు అరెస్టు చేస్తారా? ఆయన అనుచరుడు కీలక వాంగ్మూలం ఇచ్చారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న ప రిణామాలు అలానే ఉన్నాయి. తాజాగా కొడాలి నాని ప్రధాన అను చరుడు కాలిని గుడివాడ పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు షాపుపై పెట్రోల్ దాడి కేసులో కాళీ అరెస్టయ్యా రు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీ అజ్ఞాతం లోకి వెళ్లిపోయారు. ఈనేపథ్యంలో గుడివాడ పోలీసులు అస్సాం వెళ్లి మరి కాలిని రెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో13మందిని అరెస్టు చేయగా.. వారంతా ఇప్పటికే నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. తా జాగా ఖాళీని అరెస్టు చేశారు. విచారణ చేపడుతున్నారు. అయితే తాను మాజీ మంత్రి కొడాలి నాని ఆదేశాల మేరకు అలా చేశానని కాళీ చెప్పినట్లు సమాచారం. దీంతో కొడాలి నాని చుట్టూ ఉచ్చు బిగి స్తున్నట్లు తెలుస్తోంది. వైసిపి ప్రభుత్వ హయాంలో గుడివాడలో టిడిపి కార్యాలయం పై దాడి జరిగింది. ఆ పార్టీ నేత రావి వెంకటేశ్వరరావు పై కూడా దాడి జరిగింది. ఈ రెండు కేసుల్లో కాళీ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. 13మంది వైసీపీ కార్యకర్తలు ఈ దాడిలో పాల్గొన్నారు. కూ టమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కేసులో పురోగతి పెరిగింది. ఆ 13 మంది వైసీపీ కార్యకర్తల అరెస్టు జరిగింది. వారంతా ఇప్పుడు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఇప్పుడు సూత్రధారిగా భావిస్తున్న కాళీని సైతం అస్సాంలో అదుపులోకి తీసుకున్నారు గుడివాడ పోలీసులు. ఆయనను విచారిస్తున్నారు. ఎవరి ప్రమేయం ఉందా? ఎవరు ప్రోత్సహించారు? అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. 2022 డిసెంబర్ 26న వంగవీటి మోహన్ రంగా వర్ధంతి. గుడివాడలో కార్యక్రమాలు నిర్వహించేందుకు టిడిపి నేతలు సిద్ధమయ్యారు. అయితే డిసెంబర్ 25న టిడిపి నేత రావివెంకటేశ్వరరావుకు కొడాలి నాని ప్రధాన అనుచరుడు అయిన కాళీ ఫోన్ చేసి హెచ్చరించారు. రంగా వర్ధంతి నిర్వహిస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని రావి వెంకటేశ్వరరావు చెప్పగా.. చంపేస్తానని కాళీ బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే రోజు వెంకటేశ్వరరావుకు చెందిన బట్టల దుకాణం పై కొడాలి నాని అనుచరులు పెట్రోల్ ప్యాకెట్లతోదాడిచేశారన్న ఆరోపణలు కూడా వినిపించాయి. ఈ క్రమంలోనే టిడిపి కార్యాలయానికి నిప్పంటించబోతుండగా పోలీసులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. వైసిపి హయాంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే అప్పట్లో పట్టించుకోలేదు. ఓటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొడాలి నాని అనుచరులపై వరుసగా ప్రధాన అనుచరుడు కాళీ దొరకలేదు. తాజాగా అరెస్టు చేయగా.. ఈ మొత్తం ఎపిసోడ్లో కొడాలి నాని పాత్ర పై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే కాళీ నుంచి కీలక వాంగ్మూలం తీసుకున్న పోలీసులు కొడాలి నానిని అరెస్టు చేయబోతున్నట్లు ప్రచారం నడుస్తోంది.

## పెరుగుతున్న.. భార్య.. బాధితులు..!



న్యూఢిల్లీ: దేశంలో భార్య బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. బెంగళూరులో టెకీ అతుల్ సుభాశ్ ఆత్మహత్య ఘటన మరిచిపోక ముందే ఢిల్లీలోమరో భార్య బాధితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఢిల్లీలో ప్రముఖ కేఫ్ యజమాని ఆత్మహత్య చేసుకోవడం సంచలనం రేపింది. ఉడ్‌బాక్స్ కేఫ్ వ్యవస్థాపకుడు పునీత్ ఖురానా తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. . కళ్యాణ్ విహార్ ప్రాంతం మోడల్ టౌన్‌లో నివాసం ఉంటోన్న పునీత్.. తన గదిలో ఉరికి వేలాడుతూ కనిపించారు. ఈ ఘటనపై కేసునమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పునీత్ ఖురానా,ఆయన భార్య మానికా జగదీశ్ పహ్వా మధ్య విడాకుల కేసు నడుస్తుండగా.. వ్యాపారం విషయంలో ఇద్దరి మధ్య గొడవలు నడుస్తున్నాయిఉడ్‌బాక్స్ కేఫ్ యాజమాన్యం విషయంపై పునీత్, మానికా మధ్య గొడవలు జరుగుతున్నట్టు పోలీసులు తెలిపారు. భార్య వేధింపులతోనే తమ కుమారుడు బలవన్మరణానికి పాల్పడినట్టు పునీత్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. పునీత్, మానికాకు 2016లో పెళ్లి జరిగింది. ఖురానా, మానికా మధ్య జరిగిన ఫోన్ సంభాషణకు సంబంధించిన 16 నిమిషాల ఆడియో క్లిప్ ఒకటి బయటకు వచ్చింది. ఈ ఆడియోలో ఇరువురిమధ్య బిజినెస్ ప్రాపర్టీ గురించి జరిగిన వాగ్వాదం రికార్డయ్యింది. 'మనం విడాకులు తీసుకున్నాం.. కానీ, నేను ఇంకా వ్యాపార భాగస్వామినే.. నాకు రావాల్సిన మొత్తం చెల్లించాల్సిందే' అని పునీత్‌ను మానికమె డిమాండ్ చేయడం స్పష్టంగా వినిపిస్తోంది. పునీత్ ఆత్మహత్య ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు.. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పునీత్ భార్యను విచారణకు హాజరుకావాలని నోటీసు పంపారు. తమ కుమారుడిని మానికా చాలా వేధించినట్టు పునీత్ పేరంట్స్ ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం కావాలని వాళ్లు వేడుకుంటున్నారు. ఏడాది వరకు ఇద్దరు బాగానే ఉన్నారు. తరువాత గొడవలు ప్రారంభమయ్యాయి. తన బిడ్డను చాలా టార్చర్ చేసింది.. ఎంతో మానసిక వేదన అనుభవించాడు.. డబ్బుల గురించి , బిజినెస్ గురించి గొడవలుజరిగాయి.. అయితే తనకొడుకు ఎప్పుడు తన బాధను తమకు చెప్పలేదని తల్లిదండ్రులు చెప్పారు. తాము టెన్షన్ పడుతామని చెప్పేవాడు కాదు.. లోలోన చాలా బాధపడ్డాడని చెప్పారు. తన భార్య పెట్టే టార్చర్ భరించలేకే తన కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కొడుకు మరణించాడు.. తమకు న్యాయం కావాలంటూ పునీత్ తల్లిదండ్రులు చెబుతున్నారు. డిసెంబరు మొదటి వారంలో బిహార్‌కు చెందిన అతుల్ సుభాష్.. బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య నికిత సింఘానియా, ఆమె కుటుంబసభ్యుల వేధింపుల కారణంగానే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు అతుల్ 24 పేజీల సూసైడ్ లెటర్ రాసి.. దానిని హైకోర్టు, తాను పనిచేసే ఆఫీసు, తల్లిదండ్రులకు మెయిల్ చేశాడు. న్యాయవ్యవస్థపై కూడా అతుల్ ఆరోపణలు చేయడం.. విడాకుల కేసు విచారించిన జడ్జి తనను రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్టు ఆరోపించాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలన రేపింది. ఈ కేసులో అతుల్ భార్య నికిత, ఆమె తల్లి, సోదరుడ్ని బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరవక ముందే ఢిల్లీలో పునీత్ ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర కలకలం రేపుతోంది.

# పెరగని వేతనాలు - పర్మినెంట్ కాని ఉద్యోగాలు..?

ప్రయాగ్‌రాజ్: అది 2019వ సంవత్సరం ఫిబ్రవరి నెల. అంటే సుమారు ఐదు సంవత్సరాల నాటి మాట. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి ఆ నీటిని నెత్తిన చల్లుకున్నారు. ఆ దృశ్యాన్ని చూసి అందరూ తన్మయత్వంతో పులకించిపోయారు. ఇప్పు డు మరో సారి కుంభమేళా వస్తోంది. నాటి కుంభమేళాలో మోడీ చేత కాళ్లు కడిగించుకొని పట్టరాని ఆనందంతో ఉబ్బితబ్బిబైన పారిశుధ్య కార్మికుల జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. అదే కుల వివక్ష.. చాలీచాలని జీతాలు.. తుమ్మితే ఊడే ఉద్యోగాలు. వేతనాలు పెంచాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని అరచి గీపెడుతున్నా వారి మొర ఆలకించే నాథుడే కరువయ్యాడు.

**శక్తివంతుడైన నేత కాళ్లు కడిగినా:** 2019 కుంభమేళాలో మోడీ ఐదు గురు పారిశుధ్య కార్మికుల పాదాలు కడిగారు. ఆ నీటిని నెత్తిన చల్లుకున్నారు. ఇప్పుడు వారిలో ముగ్గురు మళ్లీ కుంభమేళా విధులకు హాజరవుతున్నారు. ఆ నాటి నుండి తమ జీవితాల్లో వచ్చిన గొప్ప మార్పులేవీ లేవని కర్వాకు చెందిన జ్యోతి మోక్షాతార్ వాపోయారు. 'దేశంలోఅత్యంత శక్తివంతుడైన నాయకుడు మాకాళ్లు కడిగారు. అయినామా పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యోతి అభిప్రాయంతో మరో ముగ్గురు కార్మికులు కూడా ఏకీభవించారు. కుంభమేళా సమయంలో ఒకే గదిలో తలదాచుకున్న వీరందరి పాదాలనూ నాడుమోడీ కడిగారు. వీరంతా దళితులే. మోడీతోకాళ్లు కడిగించుకున్న కార్మికుల్లో ఉత్తరప్రదేశ్‌లోని బందాకు చెందిన ప్యారేలాల్, నరేష్ కుమార్, చౌబీ, సంభాల్‌కు చెందిన హెూరీ లాల్, ఛత్తీస్‌గఢ్‌లోని కర్వాకు చెందిన జ్యోతి మోక్షాతార్ ఉన్నారు.

**ఇప్పటికీ అంటరానివారమే:** వీరిలో ముగ్గురు ఇప్పుడు కుంభమేళా విధులకు హాజరవుతున్నారు. హెూరీ లాల్ తిరిగి తన స్వగ్రామానికి వెళ్లిపోగా చౌబీ చనిపోయారు. ఆమెఉద్యోగం భర్తకు లభించింది. కుంభమేళా ముగుస్తుందని, ఆతర్వాత తమ భవిష్యత్తు ఏమిటని కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న ప్యారేలాల్, నరేష్ కుమార్, జ్యోతి ఆందోళన వ్యక్తం చేశారు. తాము నివసిస్తున్న శిబిరాల్లో ఎలాంటి మార్పులు లేవని 56 ఏండ్ల ప్యారేలాల్ చెప్పారు. కరెంట్, తాగునీటి సౌకర్యాలు సరిగా లేవని,భారీ వర్షం పడితే ఇక్కడ నివసించడం కూడా కష్టమేనని, తమను నేటికీ అంటరానివారిగానే చూస్తున్నారని వాపోయారు. తాను



## కనీస సౌకర్యాలకూ కటకటే..!?

వాల్మీకి తెగకు చెందిన వాడినని, తనకంటే ఎక్కువ కులానికి చెందిన వారు తనతో కలిసి భోజనం కూడా చేయరని నరేష్ కుమార్ తెలిపారు. తమను అఖారాల లోపలికి వెళ్లనివ్వడం లేదని, కుంభ్‌కు సంబంధించిన ఏ మత కార్యక్రమానికీ తమకు ప్రవేశం లేదని చెప్పారు.


**నెరవేరని సొంతింటి కల:** మంచి జీవన స్థితిగతుల కోసం 2019లో ప్రయాగ్‌రాజ్‌వచ్చామని, పీఎంఏవై కింద ఇంటి కోసం దరఖాస్తు చేశామని,అయితే ఇప్పటి వరకూ అధికారుల నుండి ఎలాంటి సమాచారం లేదని జ్యోతి తెలిపారు. ప్రస్తుతం ఓ మురికివాడలో నివసిస్తున్నామని, పారిశుధ్య కార్మికులం కావడంతో వేరే చోట ఇల్లు దొరకదని చెప్పారు. ప్యారేలాల్ కూడా పీఎం ఆవాస్ యోజన కింద ఇంటికో సం దరఖాస్తు చేశారు. అయితే ఇప్పటికీ అది పరిశీలనలోనే ఉంది. 1990వ దశకం చివరి నుండీ కుంభమేళాలో పనిచేస్తున్నానని అంటూ కనీసం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి అయినా వేతనం పెంచాలని అధికారులకు మొర పెట్టుకున్నారు. ఆయనకు ఎనిమిది మంది పిల్లలు. ఐదుగురు కుమార్తెలకు వివాహం అయింది. ముగ్గురు కొడుకులు ది నసరి వేతనకార్మికులుగా పనిచేస్తున్నారు. నరేష్ కూడా ఇంటి కోస ందరఖాస్తు చేశారు. కానీఆ కలనేటికీనెరవేరలేదు. 2019 లోఆయనకు నెలకుఎనిమిది వేలరూపాయలవేతనం లభించింది. ఇప్పుడుసుమారు పదివేల రూపాయలు వస్తున్నాయి.ఈస్వల్ప మొత్తంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలని ఆయన ప్రశ్నించారు.




## పుష్కలంగా భూగర్భజలాలు..

**అమరావతి,:**రాష్ట్రంలో భూగర్భ జలాల లభ్యత పెరిగింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో భూగర్భ జలమట్టం 4.19 మీటర్లు పెరిగింది. రాష్ట్రంలో డిసెంబర్‌లో 950.57 మిల్లీమీటర్లు వర్షం (సాధారణ వర్షపాతం కంటే 10.79 శాతం ఎక్కువ) కురిసింది. ఈ ఏడాదీ నైరుతి, ఈశాన్య రుతుపవనాల ప్రభావం వల్ల సమృద్ధిగా వర్షాలు కురిశాయి. దాంతో భూగర్భ జలాలు పెరిగాయి. ప్రస్తుతం భూగర్భ జలమట్టం సగటున 7.6 మీటర్లకు చేరుకుంది. భూగర్భ జలమట్టం పెరిగిన జిల్లాల్లో శ్రీసత్యసాయి జిల్లా (12.69 మీటర్లు) మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో ప్రకాశం జిల్లా (8.52 మీటర్లు),మూడో స్థానంలో పల్నాడు జిల్లా (7.97 మీటర్లు) ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా(1.16 మీటర్లు), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా (1.31 మీటర్లు), పార్వతీపురం మన్యం జిల్లా(1.52 మీటర్లు)లో అత్యల్పంగా పెరిగాయి.26 జిల్లాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా పెరగడంతో బోరు బావుల కింద రబీలో పంట సాగుకు, వేసవిలో తాగు నీటికి ఇబ్బందులు ఉండవని అధికారవర్గాలు చెబుతున్నాయి. భూగర్భ జలాల లభ్యతలో బాపట్ల జిల్లా (2.63 మీటర్లతో) ప్రథమ స్థానంలో ఉంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా (2.64 మీటర్లు) రెండో స్థానంలో, గుంటూరు జిల్లా (3.39 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాయి. భూగర్భ జలాల లభ్యత కనిష్టంగా ఉన్న జిల్లాల్లో తూర్పుగోదావరి జిల్లా (21.66 మీటర్లతో) ప్రథమ స్థానంలో నిలవగా.. ఏలూరు జిల్లా(17.59 మీటర్లు) రెండోస్థానంలో, అన్నమయ్య జిల్లా (13.67 మీటర్లు) మూడో స్థానంలో నిలిచింది.

## నలుగురితో కలవకపోవడం.. ఒంటరిగా ఉండటం వల్ల ఇన్ఫెక్షన్ల ముప్పు..



న్యూఢిల్లీ: స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసుండటం మానసిక ఆరోగ్యాన్ని చక్కగా ఉంచడంతో పాటు గుండె జబ్బులు, గుండెపోటు, టైప్ 2 డయాబెటిస్, ఇన్ఫెక్షన్ల లాంటి వ్యాధులు రాకుండా నిరోధించే అవకాశం ఉందని తాజా అధ్యయనం తేల్చింది. యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్, ఫుడాన్ యూనివర్సిటీ యూకే బయె బ్యాంక్‌లోని 42 వేల మంది డాటాను విశ్లేషించిన తర్వాత ఈ వివరాలను వెల్లడించింది. నలుగురితో కలవకపోవడం, ఒంటరిగా ఉండటం వల్ల రక్తంలో ఉండే నిర్దిష్ట ప్రొటీన్లు ఇన్ఫ్లమేషన్(నొప్పి, మంట), రోగనిరోధక శక్తి ప్రతిస్పందన, ఒత్తిడి నియంత్రణ వంటి తీవ్ర అనారోగ్య పరిస్థితులను పెంపొందిస్తాయని వారు కనుగొన్నారు. ఆక్సిటోసిన్ లాంటి హార్మోన్లను ఏడీఎమ్ అనే కీలక ప్రోటీన్ నియంత్రిస్తున్నదని పరిశోధకులు గుర్తించారు. భావోద్వేగాలు, సామాజిక సంబంధాల ప్రాసెసింగ్‌కు బాధ్యత వహించే ఈ ప్రోటీన్ స్థాయిలు ఎక్కువైతే మరణ ముప్పు పెరుగుతుందని హెచ్చరించారు.

### హార్ట్ ఎటాక్ వచ్చే 30 రోజుల ముందు

### ఈ సంకేతాలు, లక్షణాలు కనిపిస్తాయి..

# జాగ్రత్త పడండి..!



ప్రస్తుత తరుణంలో చాలా మంది గుండె పోటుతో మరణిస్తున్నారు. ఒకప్పుడు కేవలం వయస్సు పైబడిన వారు మాత్రమే గుండె పోటు బారిన పడేవారు. కానీ ఇప్పుడు అలా కాదు. చిన్న వయస్సులో ఉన్నవారు కూడా హార్ట్ ఎటాక్, కార్డియాక్ అరెస్ట్, హార్ట్ ఫెయిల్యూర్‌తో ఉన్నట్లుండి కుప్పకూలి చనిపోతున్నారు.

ఇవి జరగడానికి ముందే వచ్చే సంకేతాలను చాలా మంది గమనించడం లేదు. దీంతో అనర్థం జరుగుతోంది. ఈ మధ్య కాలంలో యుక్త వయస్సులో ఉన్నవారు ఇలా చనిపోవడం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. అయితే హార్ట్ ఎటాక్ లేదా కార్డియాక్ అరెస్ట్, హార్ట్ ఫెయిల్యూర్ అవడానికి ముందే మన శరీరం మనకు కొన్ని సూచనలను, సంకేతాలను ఇస్తుంది. వాటిని గుర్తించడం ద్వారా ఎలాంటి అనర్థం జరగకుండా మనం ముందుగానే పసిగట్టి చికిత్స తీసుకోవచ్చు. దీంతో ప్రాణాలను నిలుపుకోవచ్చు.

**కళ్ల కింద వాపులు..:** హార్ట్ ఎటాక్ వచ్చే ముందు కొందరిలో పలు లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా నిద్రలేమి సమస్య ఉంటుంది. అసలు ఏమాత్రం నిద్ర పట్టదు. దీంతో కళ్లు వాపులకు గురవుతాయి. గుండె నుంచి రక్తం సరఫరా సరిగ్గా జరగకపోతే ఇలా జరుగుతుంది. అయితే కేవలం నిద్రలేమి సమస్యనే అయితే సరిగ్గా నిద్రపోతే ఈ లక్షణం నుంచి బయట పడవచ్చు.

అలా చేసినా కూడా ఈ లక్షణం మాత్రం అలాగే ఉంటే అప్పుడు దాన్ని గుండె జబ్బుగా అనుమానించాలి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. అలాగే హార్ట్ ఎటాక్ వచ్చే ముందు కళ్ల కింద బిళ్లలాగా వస్తాయి. వాటిల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోయి అలా బిళ్లల మాదిరిగా కనిపిస్తాయి. ఇలా ఉంటే చాలా డేంజర్. వీరికి అతి త్వరలోనే హార్ట్ ఎటాక్ వస్తుందని గుర్తించాలి. వెంటనే చికిత్స తీసుకోవాలి.

**ఛాతిపై బరువు పెట్టినట్లు..:** రక్త సరఫరా సరిగ్గా జరగకపోవడం వల్ల కళ్లు వాపులకు గురై నొప్పులుగా ఉంటాయి. అసలు ఏం చేసినా ఈ నొప్పి తగ్గదు. ఈనొప్పి అంతకంతకూ పెరిగిపోతుంటే వెంటనే హాస్పిటల్‌కు వెళ్లిచికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. అదేవిధంగా కొందరికి కంటి చూపు కూడా పోయే ప్రమాదం ఉంటుంది. ఇలా గనక జరిగితే దాన్ని కచ్చితంగా గుండె సమస్యగా అనుమానించాలి. ఇక హార్ట్ ఎటాక్ వచ్చే ముందు ఛాతిలో బరువుగా ఉంటుంది. ఛాతిపై పెద్ద బరువు పెట్టినట్లు అనిపిస్తుంది. శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా ఉంటుంది. అలాగే అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా మారుతుంది. ముఖ్యంగా మెట్లు ఎక్కేటప్పుడు లేదా దిగేటప్పుడు ఈ విధంగా అనిపిస్తుంది. ఇలాంటి లక్షణాలు కచ్చితంగా హార్ట్ ఎటాక్‌కు సంబంధించినవే. కనుక ఇవి కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు.

**ఎడమ వైపు నొప్పి ఉంటే..:** చాలా మందికి గ్యాస్ నొప్పికి, ఛాతిలో వచ్చే గుండె నొప్పికి తేడా తెలియదు. గ్యాస్ నొప్పి వచ్చి పోతూ ఉంటుంది. కానీ గుండె నొప్పి వస్తే అసలు తట్టుకోలేరు. సూదులతో పొడిచినట్లు వస్తుంది. అలాగే ఆ నొప్పి ఎడమ దవడ నుంచి ఎడమ భుజం మీదుగా ఎడమ చేయి కిందకు వ్యాప్తి చెందుతుంది. ఇలా గనక జరిగితే కచ్చితంగా దాన్ని గుండె పోటుగా భావించాలి. లేదంటే గుండె పోటు రాబోతుందని అర్థం చేసుకోవాలి.

ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. ఇలా కొన్ని రకాల సూచనలు హార్ట్ ఎటాక్ కు ముందు లేదా హార్ట్ ఎటాక్ వచ్చేందుకు కొన్ని రోజుల ముందుగానే కనిపిస్తాయి. వీటిని జాగ్రత్తగా పరిశీలిస్తే ప్రాణాంతకం కాకుండా అడ్డుకోవచ్చు. దీంతో ప్రాణాలను నిలుపుకోవచ్చు.



### రోజూ ఒక కప్పు దానిమ్మ పండ్ల జ్యూస్‌ను తాగితే

# ఏం జరుగుతుందో తెలుసా..?

ఎరుపు రంగులో చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా మనకు దానిమ్మ పండ్లు కనిపిస్తాయి. ఇవి మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. కనుక దానిమ్మ పండ్లను మనం ఎప్పుడైనా తినవచ్చు.సాధారణంగా చాలా మంది కేవలం జ్వరం వచ్చినప్పుడు లేదా శస్త్ర చికిత్స జరిగినప్పుడు మాత్రమే దానిమ్మ పండ్లను తింటుంటారు. లేదా వాటి రసం తాగుతుంటారు. కానీ వాస్తవానికి ఈ పండ్లను మనం రోజూ తినాలి. అయితేఈ పండ్లను తినడం ఇష్టంలేనివారు వీటి జ్యూస్‌ను అయినా సరే రోజూ తాగవచ్చు.

రోజూ ఒక కప్పు మోతాదులో దానిమ్మ పండ్ల జ్యూస్‌ను తాగితే అనేక లాభాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజూ దానిమ్మ పండ్ల రసాన్ని తాగుతుంటే అనేక లాభాలు ఉం టాయని వారు అంటున్నారు.

**గుండె పనితీరుకు..:** దానిమ్మ పండ్లలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా క్యాన్సర్, గుండె జబ్బులు వంటి తీవ్రమైన వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. దానిమ్మ పండ్ల రసాన్ని తాగుతుంటే హైబీపీ నియంత్రణలోకి వస్తుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో గుండె పనితీరు మెరుగు పడుతుంది. గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా హార్ట్ ఎటాక్ రాకుండా ఉంటుంది. దానిమ్మ పండ్లలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. టైప్ 2 డయాబెటిస్ నుంచి విముక్తి లభిస్తుంది. అదేవిధంగా క్యాన్సర్ కణాల నాశనం అవుతాయి. క్యాన్సర్ పెరగకుండా చూసుకోవచ్చు.

**జీర్ణ వ్యవస్థకు..:** దానిమ్మ పండ్ల రసాన్ని సేవించడం వల్ల జీర్ణ సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. ముఖ్యంగా విరేచనాలు తగ్గుతాయి. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇదిరోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు, వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుం ది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం దానిమ్మ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్ క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. దీంతో పలురకాల క్యాన్సర్లు రాకుండా చూసుకోవ చ్చు. ముఖ్యంగా ప్రోస్టేట్ క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**చర్మం యవ్వనంగా కనిపిస్తుంది..:** దానిమ్మ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు,విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి.చర్మాన్ని సంరక్షిస్తాయి.వయస్సు మీద పడడం వల్ల వచ్చే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. దీంతోచర్మం యవ్వనంగా కనిపిస్తుంది.

ముఖంపైఉండే ముడతలు, మచ్చలు, కళ్ల కింద ఏర్పడే నల్లని వలయాలు తగ్గిపోతాయి. దానిమ్మ పండ్ల జ్యూస్‌నురోజూ తాగడం వల్ల మెదడు యాక్టివ్ గా మారుతుంది.

జ్ఞాపకశక్తి పెరుగుతుంది. దీంతోవయస్సు మీద పడడం వల్ల వచ్చే అల్జీమర్స్ రాకుండా చూసుకోవచ్చు. దానిమ్మ పండ్ల రసాన్ని తాగితేశరీరం ఇన్సులిన్‌నుమరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్‌లెవల్స్‌తగ్గుతాయి. డయాబెటిస్‌లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారికి ఇదిఎంతగానో మేలు చేస్తుంది. ఇలా దానిమ్మ పండ్ల రసాన్ని రోజూ సేవించడం వల్ల అనేక అద్భుతమైన లాభాలను పొందవచ్చు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215